thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 210 | జగిత్యాల శుక్రవారం 13 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ఆఫ్ఘన్‌ను చిత్తుచిత్తు చేసిన భారత్



11



రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదక శక్తులుగా జీసీసీలు

- టెక్నాలజీ, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం
- 'మార్స్' జీసీసీ ప్రారంభోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 12 : తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను కీలక చోదక శక్తులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కొత్త టెక్నాలజీ అభివృద్ధి, ఆర్ అండ్ డీ, డేటా అనలిటిక్స్, ప్రొడక్ట్ డిజైన్, ఇంజినీరింగ్, ఇన్నోవేషన్

మిగతా 2వ పేజీలో..



జూన్ 2నాటికి టిమ్స్‌లు పూర్తి సేవలందించాలి



- వచ్చే ఏడాదిలో ఉస్మానియా సేవలు ప్రజలకు అందాలి
- మూడు టిమ్స్‌కు ఏకీకృత నియామకాలు
- నిమ్స్.. టిమ్స్‌ల మధ్య సమన్వయం ఉండాలి
- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 12 : అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, నిమ్స్ విస్తరణ పనులు జూన్ 2వ తేదీ నాటికి పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి ఉస్మానియా నూతన హాస్పిటల్ పనులు పూర్తి చేసి ప్రజలకు సేవలందించేలా చూడాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖపై ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ, నిమ్స్ విస్తరణ,

మిగతా 2వ పేజీలో..

బీఆర్ఎస్ అప్పులు.. ఎల్‌నినో తిప్పలు

- అయినా ఇందిరమ్మ ఇళ్లు ఆగవు
- వచ్చే దీపావళికి 'క్యూర్'లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పూర్తి
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

3



22ఎ పరిష్కారంలో ఆలస్యానికి తావివ్వొద్దు

- ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండొద్దు
- కలెక్టర్ల పర్యవేక్షణతోనే సామాన్యులకు ప్రయోజనం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ఆదేశం

3



భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- ఒకేసారి 21 మందికి స్థానచలనం
- హైదరాబాద్ సీపీగా మహేష్ మురళీధర్ భగవత్
- ఫైర్ అండ్ డిజాస్టర్ డీజీగా వీసీ సజ్జనార్
- ఏసీబీ డీజీగా చారు సిన్హా, జైళ్ల శాఖకు స్వాతి లక్రా
- శాంతిభద్రతల ఏడీజీపీగా అకున్ సభర్వాల్

2





4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు

- రాష్ట్రవ్యాప్తంగా మంజూరు పత్రాల పంపిణీ ప్రారంభం
- ఈ నెల 12 నుంచి 18 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- మహిళలకు పెద్దపీట.. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు
- నవంబర్ 19న లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ

3



ప్రభుత్వ నిధులతో 'భారత్ సమ్మిట్' ఏంటి?

- రాహుల్‌కు ఏం విజన్ ఉందని ప్రపంచానికి పరిచయం చేస్తారు
- కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు

2

ఎఫ్ఎంజీలకూ రూ.29,792

స్టైపెండ్ చెల్లించాలి



- సుప్రీంకోర్టు తీర్పునే ధిక్కరించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

2



మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

- డ్రైవర్ శంకర్ గౌడ్ కుమారుడికి ఆర్టీసీలో ఉద్యోగం
- నియామక పత్రం అందజేసిన మంత్రులు పొన్నం, తుమ్మల

3

ప్రజాప్రతినిధుల కోర్టుకు

రేవంత్ రెడ్డి

- 2021 సాగర్ ఉప ఎన్నికల్లో కోవిడ్ నిబంధనల ఉల్లంఘన కేసు
- వాంగ్మూలం నమోదుకు నాంపల్లి కోర్టుకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

2

కుల్గామ్ దాడికి కొత్త ఉగ్ర సంస్థ బాధ్యత

- పస్తరాన్-ఎ-హుర్రియత్ కశ్మీర్ పేరుతో ప్రకటన
- సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్టుపై కాల్పుల్లో ముగ్గురికి గాయాలు
- ఆర్ఎస్ఎస్, భారత ప్రభుత్వమే లక్ష్యమంటూ హెచ్చరిక

4



మీడియా దేశాభివృద్ధికి తోడ్పడాలి

- 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే లక్ష్యం
- డ్రగ్స్ రహిత భారత్, జాతీయ ఐక్యతపై కథనాలు రావాలి
- గత 12 ఏళ్లలో దేశంలో గణనీయమైన మార్పులు
- సాంకేతికతతో మారుతున్న మీడియా రంగం
- మీడియా ప్రతినిధులతో దీపావళి మిలన్‌లో ప్రధాని ముచ్చట్లు

4





బంగ్లాదేశ్‌లో మళ్లీ హింసాత్మక ఆందోళనలు

- ఢాకాతో పాటు పలు జిల్లాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- బస్సులు, ట్రక్కులకు నిప్పు.. నాటుబాంబుల పేలుళ్లు

4

పెట్టుబడిదారులు రావడంలేదు

- కాంగ్రెస్ నిర్వహించేది 'యాంటీ-భారత్ సమ్మిట్'
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



హైదరాబాద్, నవంబర్ 12 :

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు చెబుతున్న 'భారత్ సమ్మిట్' ద్వారా రాష్ట్రానికి ఒక్క పెట్టుబడిదారుడు కూడా రావడం లేదని, పరిశ్రమల స్థాపన జరగడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు విమర్శించారు. నాగోల్‌లో గురువారం జరిగిన భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) రాష్ట్ర కార్యవర్గ సమావేశం(యువ సంవాద్)లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కాంగ్రెస్ తీరుపై, శుక్ర, శనివారాల్లో జరిగే 'భారత్ సమ్మిట్'పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేవలం ప్రపంచంలో అరాచకాన్ని సృష్టించే ఉద్దేశంతో పనిచేస్తున్న ప్రోగ్రెసివ్ అలయన్స్, ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ వంటి సంస్థల ప్రతినిధులు మాత్రమే ఈ సదస్సుకు హాజరవుతున్నారని తెలిపారు. బంగ్లాదేశ్, నేపాల్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో జరిగిన అస్థిరత, ఆందోళనల వెనుక ఇలాంటి సంస్థల హస్తం ఉందని, సల్మాన్ ఖుర్షీద్, శ్యామ్ పిట్రోడా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సు రాహుల్ గాంధీ అభిప్రాయాలను వినడానికి మాత్రమేనని పేర్కొన్నారు. ఎందులోనూ స్పష్టమైన వైఖరి, దృక్పథం, విజన్ లేని రాహుల్ కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ముమ్మాటికీ 'యాంటీభారత్ సమ్మిట్' అని ఆయన అభివర్ణించారు. దేశానికి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వ్యాసాలు రాసిన వార్సేకు చెందిన జర్నలిస్టు హెల్లె లింగ్‌ను కాంగ్రెస్ పార్టీ ఈ సదస్సుకు ఆహ్వానించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశ వ్యతిరేక వైఖరి ఉన్న వ్యక్తులకు వీసా రద్దు సరైన నిర్ణయమేనని సమర్థించారు.

నల్ల జెండాలతో నిరసన తెలపాలి

రాష్ట్రప్రజలకు ఆరు గ్యారంటీలు, ఉద్యోగాల పేరిట హామీలిచ్చి అమలు చేయకుండా మోసం చేసిన రాహుల్ గాంధీకి హైదరాబాద్‌లో అడుగుపెట్టే నైతిక హక్కు లేదని రామచందర్‌రావు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను, ఈ సదస్సును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసనలు తెలపాలని, దిష్టిబొమ్మలను దహనం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. యువత, జెన్ జీ ఆలోచనా విధానంపై మాట్లాడుతూ 19972012 మధ్య జన్మించిన జెన్ జీ యువత 2024 ఎన్నికల్లో ఓటు హక్కు పొంది బీజేపీకి అండగా నిలిచినట్లు చెప్పారు. 2024లో జరిగిన 1,100 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 850 స్థానాలను గెలుచుకోగా కాంగ్రెస్ కేవలం 150 స్థానాలకే పరిమితమైందని, యువత ఎవరివైపు ఉందో దీన్నిబట్టే అర్థమవుతోందని అన్నారు. ప్రస్తుతం రోడ్లపైకి వచ్చి అందోళనలు చేస్తున్న వారు నిజమైన జెన్ జీ కాదని, వారు ఇతర శక్తుల ప్రోద్బలంతో పనిచేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఒక దేశం సోషలిజం, కమ్యూనిజం లేదా క్యాపిటలిజం వల్ల అభివృద్ధి చెందదని, జాతీయవాదం మాత్రమే దేశాన్ని ముందుకు నడిపించగలదని ఆయన ఉద్ఘాటించారు. చిన్న దేశమైన ఉక్రెయిన్ శత్రువులను ఎదుర్కోవడం వెనుక, అణుబాంబు దాడుల తర్వాత జపాన్ అగ్రగామిగా ఎదగడం వెనుక బలమైన జాతీయవాద స్ఫూర్తి ఉందని, మన యువతలో కూడా అదే జాతీయవాద భావనను పెంపొందించాలని పిలుపునిచ్చారు. 2014కు ముందు 6 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు నేడు 3 శాతానికి తగ్గిందని(ప్రపంచ సగటు 4.8 శాతం కంటే తక్కువ), నేడు భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలిచిందంటూ మోదీ ప్రభుత్వం పన్నెండేళ్లుగా సాధించిన విజయాలను వివరించారు. క్రీడల రంగంలోనూ ఖేలో ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, పతకాలు సాధించే స్థాయికి దేశాన్ని తీసుకెళ్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, పాలసీ రీసెర్చ్ అంశాలను యువమోర్చా కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

జూన్ 2నాటికి టిమ్స్‌లు పూర్తి సేవలందించాలి

మొదటిపేజీ తరువాయి



ఉస్మానియా నూతన దవాఖానాల నిర్మాణ పనులు, వాటికి అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మూడేళ్లలోనే తొమ్మిది మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు. సనత్ నగర్, అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌ల్లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానం పాటించాలని సీఎం ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు టిమ్స్ మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. హాస్పిటల్స్ నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బంది నియామకం, ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సూచించారు. టిమ్స్‌ల పర్యవేక్షణకు గ్రూప్ 1 అధికారులను నియమిస్తామని, హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామని తెలిపారు. నిమ్స్‌లో శస్త్రచికిత్సలకు సమయం ఎక్కువ తీసుకుంటున్నందున సనత్ నగర్ టిమ్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. నిమ్స్‌లో బెడ్స్ లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యమైనా సనత్ నగర్ టిమ్స్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. టిమ్స్‌లో వైద్యుల నియామకం పూర్తయ్యే వరకు బయటినుంచి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్నమరో 79 డయాలసిస్ సెంటర్ల పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. టిమ్స్‌తో పాటు బోధన కళాశాలలు, నర్సింగ్ కళాశాలల పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియ ఏకకాలంలో పూర్తవ్వాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్యులు, సిబ్బంది హాజరైన సమయం, విధుల నుంచి వెళ్లే సమయాన్ని నమోదు చేయాలని, హాజరు విషయంలో బయోమెట్రిక్ విధానం అమలయ్యేలా చూడాలని, ఏఐతో పర్యవేక్షణ చేయాలని శాఖాధికారులను ఆదేశించారు.

మూడేళ్లలోనే ప్రభుత్వ హాస్పిటల్స్‌లో బెడ్ల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఔట్ పేషెంట్ల సంఖ్య 7 లక్షల నుంచి 9 లక్షలకు పెరగడం, ఇన్ పేషెంట్ల సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం కేటాయించగా గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మూడేళ్లలోనే వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారా మెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ, టీజీవీఎంఎస్ఐడీసీ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ముషారఫ్ అలీ ఫరూఖీ, ఆర్ అండ్ బీ కార్యదర్శి ఇలంబర్తి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌పై సమీక్ష

అనంతరం పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(పీఆర్‌టీఎస్)పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. పీఆర్‌టీఎస్ కోసం ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ మీదుగా రాణిగంజ్ బస్ స్టాండ్ వరకు ఒక లైన్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అసెంబ్లీ మెట్రో నుంచి రవీంద్ర భారతి, సెక్రటేరియట్, ఐమాక్స్ నుంచి బేగంపేట్‌కు కలుపు□తూ ఇంకో లైన్ ఏర్పాటు చేయాలని, నెక్లెస్ రోడ్డులో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేసి అందులో పీఆర్టీఎస్ డిపో ఏర్పాటు చేయాలని సూచించారు. కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్ స్పేస్, బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ వరకు లైన్‌ను వెంటనే చేపట్టాలన్నారు. గచ్చిబౌలి ఐకియా సమీపంలో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేసి అందులో పీఆర్టీఎస్ డిపో ఏర్పాటు చేయాలని, డిసెంబర్ నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఏడాదిలో ఈ లైన్ పూర్తి అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి సీఎంవో కార్యదర్శి మాణిక్ రాజ్, హైదరాబాద్ మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు ఎండీ అజిత్ రెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఎఫ్ఎంజీలకూ రూ.29,792 స్టైపెండ్ చెల్లించాలి

హైదరాబాద్, నవంబర్ 12 :

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎదుట 34 రోజులుగా నిరసన తెలుపుతున్న విదేశీ వైద్య పట్టభద్రు(ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్)ఎఫ్ఎంజీ)లపై పోలీసులు అత్యంత కర్కశంగా వ్యవహరించి లాఠీచార్జి చేసి ఈడ్చుకెళ్లి అక్రమ కేసులు బనాయించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. సమస్యను చెప్పుకునేందుకు తనను కలిసిన ఎఫ్ఎంజీ వైద్య విద్యార్థులకు భరోసా ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అనేక ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఉన్నప్పటికీ ఎంతోమంది రాష్ట్ర విద్యార్థులు విదేశాలకు వెళ్లి వైద్య విద్యనభ్యసించి తిరిగి స్వదేశానికి వస్తున్నారని తెలిపారు. భారత్‌కు వచ్చిన తర్వాత నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిర్వహించే అత్యంత కఠినమైన స్క్రీనింగ్ పరీక్షలో (ఎఫ్ఎంజీఈ) వేలాది మంది పోటీ పడితే వందల సంఖ్యలో మాత్రమే ఉత్తీర్ణులవుతారని తెలిపారు. ఆ పరీక్షలో అర్హత సాధించిన తర్వాత స్థానిక మెడికల్ కాలేజీలలో చదివిన వైద్య విద్యార్థుల మాదిరిగానే వీరు కూడా ప్రభుత్వ దవాఖానాల్లో హౌస్ సర్జన్లుగా (సీఆర్ఎంఐ ఇంటర్న్‌షిప్) సమానంగా సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. స్థానిక హౌస్ సర్జన్లకు ప్రభుత్వం రూ.30 వేల వరకు స్టైపెండ్ అందిస్తుండగా సమాన విద్యార్హత ఉండి అంతే స్థాయిలో శ్రమిస్తున్న ఎఫ్ఎంజీ ఇంటర్న్‌లకు రూ.5 వేలు మాత్రమే చెల్లించడం తీవ్ర వివక్ష అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సమాన పనికి సమాన వేతనం' ఇవ్వాలని, ఇతర హౌస్ సర్జన్లతో సమానంగా స్టైపెండ్, అలవెన్సులు అందించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పొరుగు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలు ఈ నిబంధనను అమలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొన్ని రోజులుగా మెడికల్ కౌన్సిల్ ముందు నిరాహార దీక్షలు చేస్తున్న వైద్య విద్యార్థులపై ప్రభుత్వం కనీసం పరిశీలిస్తాం అనే సానుభూతి మాట కూడా మాట్లాడకపోగా పోలీసులతో దౌర్జన్యం చేయించి తప్పుడు కేసులు పెట్టడం సిగ్గుచేటని రామచందర్ రావు మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎఫ్ఎంజీ ఇంటర్న్‌లందరికీ ఇతర హౌస్ సర్జన్లతో సమానంగా నెలకు రూ.29,792 స్టైపెండ్‌తోపాటు జనవరి 2026 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ముఖ్యమంత్రిని, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిని బీజేపీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ డిమాండ్‌ను అమలు చేయడం వల్ల ప్రభుత్వంపై ఏడాదికి పడే ఆర్థిక భారం రూ.2 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. వైద్య విద్యా రంగానికి, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కనీసం రూ.2 కోట్లు కూడా ఖర్చు చేయలేదా అని రామచందర్‌రావు ప్రశ్నించారు. ఎఫ్ఎంజీ విద్యార్థుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ సంఘీభావం తెలుపుతోందని, వారికి న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదక శక్తులుగా జీసీసీలు

మొదటిపేజీ తరువాయి

తదితర విభాగాల్లోనూ కీలక పాత్ర పోషించేలా వాటికి మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. స్నికర్స్, పెడిగ్రీ, రాయల్ కానిన్ తదితర ప్రముఖ బ్రాండ్లతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మార్స్ సంస్థ గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన జీసీసీని ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌ను సంప్రదాయ ఐటీ సేవల కేంద్రం నుంచి ప్రపంచస్థాయి టెక్నాలజీ, ఇన్నోవేషన్, నాలెడ్జ్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. కొత్త రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు, ఉద్యోగావకాశాలను పెంపొందించేందుకు ఐటీ/ఐటీఈఎస్ రంగంలో హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను ఇతర పరిశ్రమలతో అనుసంధానించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగానే 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లోనూ టెక్నాలజీ, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. జెన్‌పాక్ట్ సహకారంతో ఏర్పాటైన ఈ కేంద్రంలో ప్రస్తుతం 400 మందికిపైగా ఉపాధి లభించనుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య వేయికి పెరుగుతుందని చెప్పారు. మార్స్ గ్లోబల్ ఆపరేషన్స్‌కు అవసరమైన డిజిటల్, డేటా, ఏఐ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ క్లాస్ ఆగార్డ్, జెన్‌పాక్ట్ ప్రతినిధి తరుణ్ చోప్రా, అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ ప్రతినిధి ఎమీలియా బి.స్మిత్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల కోర్టుకు రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 12 :



కోవిడ్ సమయంలో నాగార్జునసాగర్ ఉప ఎన్నిక సందర్భంగా తనపై నమోదైన కేసుకు సంబంధించి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు గురువారం హాజరయ్యారు. బీఆరఎస్ ప్రభుత్వ కాలంలో 2021 ఏప్రిల్ 11వ తేదీన నాగార్జునసాగర్ ఉప ఎన్నికకు సంబంధించి నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో మాస్కులు ధరించకుండా కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించి పాల్గొన్నారని అప్పుడు టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఎ.రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణకు వచ్చింది. సీఆర్‌పీసీ 313 కింద నిందితుల వాంగ్మూలం నమోదు చేసేందుకు కోర్టు విచారణ చేపట్టగా సీఎం రేవంత్‌రెడ్డి

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, నవంబర్ 12:

తెలంగాణ పోలీస్ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో మార్పులు చేపట్టింది. 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ గురువారం జీవో నంబర్ 1654 జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు.

1995 బ్యాచ్‌కు చెందిన మహేష్ మురళీధర్ భగవత్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమించారు. ప్రస్తుతం ఎల్ అండ్ ఓ డీజీపీగా ఉన్న ఆయన వీసీ సజ్జనార్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. సజ్జనార్‌కు ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ డీజీతో పాటు ఎస్పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగం డీజీపీగా డాక్టర్ సౌమ్య మిశ్రా నియమితులయ్యారు. ఆర్గనైజేషన్, లీగల్ విభాగాల బాధ్యతలు కూడా ఆమెకు కేటాయించారు. స్వాతి లక్రాకు జైళ్ల శాఖ డీజీగా, హోంగార్డ్స్ అదనపు బాధ్యతలు అప్పగించారు. చారు సిన్హా ఏసీబీ డీజీగా నియమితులవగా, సీఐడీ డీజీగా అదనపు బాధ్యతలు కొనసాగనున్నాయి. ఏసీబీ డైరెక్టర్‌గా ఎస్. చంద్రశేఖర్ రెడ్డిని నియమించారు. డాక్టర్ అనిల్ కుమార్ తెలంగాణ ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న వై. నాగిరెడ్డిని పౌరసరఫరాల కమిషనర్, ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేశారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ ఆపరేషన్స్ డీజీపీగా విక్రమ్ సింగ్ మాన్, టీజీటీఐఏఆర్ఎస్ డైరెక్టర్‌గా ఎం. స్టీఫెన్ రవీంద్ర నియమితులయ్యారు.



మల్టీ జోన్ 1 ఐజీగా కార్తికేయకు బాధ్యతలు అప్పగించారు. ఐసీసీసీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కూడా కేటాయించారు. రైల్వేస్ ఐజీగా కే. రమేష్ నాయుడు, మల్టీ జోన్2 డీఐజీగా నారాయణ నాయక్, జోన్7 (జోగులాంబ) డీఐజీగా జి. చందన దీప్తిని నియమించారు. రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్‌గా డి. జోయల్ డేవిస్‌కు బాధ్యతలు అప్పగించారు.

ప్రభుత్వ నిధులతో 'భారత్ సమ్మిట్' ఏంటి?

హైదరాబాద్, నవంబర్ 12 :



కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారత్ సమ్మిట్‌పై కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సదస్సును ఏ ప్రాతిపదికన, ప్రభుత్వ నిధులతో ఎలా నిర్వహిస్తారని విలేకరుల సమావేశంలో ప్రభుత్వాన్ని నిలదీశారు. దేశంపైన విషం చిమ్మే శక్తులకు, జార్జ్ సోరోస్ వంటి భారత వ్యతిరేక శక్తుల ఎజెండాకు తెలంగాణ వేదిక కావడం, భారత్ సమ్మిట్ పేరుతో ఆ శక్తులన్నీ హైదరాబాద్‌లో కలవడం దురదృష్టకరమన్నారు. ఇది భారత్ వ్యతిరేక సమ్మిట్.. దేశ అభివృద్ధిని అడ్డుకునే సమ్మిట్.. దేశ రాజ్యాంగ బద్ధ సంస్థలను బద్నాం చేసే సమ్మిట్ అని అభివర్ణించారు. మోదీపైన వ్యక్తిగతంగా తప్పుడు ఆరోపణలు చేసేందుకు పెట్టుకున్న వేదిక ఇది అని విమర్శించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అనేక సంవత్సరాలుగా ప్రజాబలం కోల్పోయి, ప్రజల మద్దతు లేక వరుస ఓటములను కప్పిపుచ్చుకునే సమ్మిట్ ఇదన్నారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఖాతాలో వంద ఓటములు చేరాయని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో పదేపదే విఫలమవుతున్న రాహుల్ గాంధీ విజన్‌ను ప్రపంచ దేశాల ముందుంచేందుకే ఈ సదస్సు నిర్వహిస్తున్నామని చెబుతున్నారని, అసలు ఆయనకు ఎలాంటి విజన్ ఉందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. దేశంలో అభివృద్ధి కార్యక్రమాలను ఏనాడైనా ఆయన ప్రశంసించారా అని నిలదీశారు. సొంత ప్రభుత్వం చేసిన ఆర్డినెన్స్‌ను 'కంప్లీట్ నాన్సెన్స్' అని చించేసి నాటి ప్రధాని మన్మోహన్‌ను అవమానించిన చరిత్ర రాహుల్ గాంధీది. ఈ విజన్‌నే ప్రపంచానికి పరిచయం చేస్తారా అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో ఉగ్రవాదం తగ్గిందని, అవినీతి, కుటుంబ రాజకీయాలకు చోటు లేకుండా పోయిందని తెలిపారు. అలాంటి పురోగతిని పక్కనపెట్టి బంగ్లాదేశ్, శ్రీలంక వంటి పరిస్థితులు వస్తాయని ప్రచారం చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని అన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఒక లక్ష్మణ రేఖ ఉంటుందని, ప్రజల సొమ్ముతో పార్టీ కార్యక్రమాలను నిర్వహించడం ఎంతవరకు సమంజసమని కిషన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

తెలంగాణలో హామీల అమలుపై నిలదీత

ఇదే హైదరాబాద్ వేదికగా ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని ఒకవైపు చెబుతూనే మరోవైపు దేశంలోకి పెట్టుబడులు రాకుండా కుట్ర పన్నుతున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. రాహుల్ గాంధీ హైదరాబాద్ వస్తున్న నేపథ్యంలో 2023 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలు, డిక్లరేషన్ల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆరఎస్ అప్పులను కాంగ్రెస్ మరింత పెంచడంతో తెలంగాణ ఆర్థిక అత్యయిక పరిస్థితి వైపు వెళ్తోందని, రిటైరైన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ కూడా అందడం లేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.2,500 ఇస్తామన్న హామీ ప్రకారం ప్రతి ఆడబిడ్డకు రూ.85,000 బకాయి పడ్డారని, అలాగే రూ.4,000 పింఛను కింద ఒక్కొక్కరికి రూ.1,02,000 బకాయిలు ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగ యువతకు రూ.4,000 చొప్పున భృతి ఇస్తామన్న హామీ అమలు కాలేదని, ఒక్కొక్కరికి రూ.1.36 లక్షల బకాయి పడ్డారని చెప్పారు. వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న రూ.12,000, కౌలు రైతుల సహాయం, బీసీ డిక్లరేషన్, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిగా అటకెక్కాయని ఆరోపించారు.

22-ఎ పరిష్కారంలో ఆలస్యానికి తావివ్వొద్దు

హైదరాబాద్, నవంబర్ 12 :

ఏళ్లతరబడి అపరిష్కృతంగా ఉన్న 22ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి దరఖాస్తుదారులకు ఉపశమనం కలిగించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 22ఎ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు, పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22ఎ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా జీవో 118, జీవో 76లకు సంబంధించి మెమోలు, 22ఎ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు, యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జీవో 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అంశాలకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల న్నింటినీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని పేర్కొన్నారు. ప్రతి వారం జిల్లాస్థాయిలో కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, ఇతర సంబంధిత అధికారులు సమావేశమై 22ఎ సమస్యల పరిష్కారంపై సమీక్షించుకోవాలని సూచించారు. జిల్లాస్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని అంశాలను రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్‌కుమార్ నాయకత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి సిఫారసు చేయాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, జారీ చేస్తున్న జీవోలు, మెమోలు ప్రభుత్వ ఉత్తర్వులకే పరిమితం కాకూడదని, వాటి అసలు ఉద్దేశం క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే ప్రజలకు నిజమైన మేలు జరుగుతుందని మంత్రి అన్నారు. ముఖ్యంగా కలెక్టర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి ప్రకారం అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యూఎల్‌సీకి సంబంధించి వివిధ కోర్టులు వెలువరించిన తుది తీర్పులు, ప్రభుత్వం తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్లు(ఎస్ఎల్‌పీలు) దాఖలు చేసే అంశాలు, ఎస్ఎల్‌పీలు దాఖలు చేయడానికి అవకాశం లేని ఇతర అంశాలన్నింటిపై వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి కమిటీ సమగ్ర నివేదిక అందించాలని మంత్రి సూచించారు. ఈ నివేదికపై ముఖ్యమంత్రితో చర్చించి రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. 22ఎ జాబితాలో ఉన్న ప్రతి భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, సంబంధిత ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన తర్వాతే తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిజమైన యజమానులు తమ భూములపై హక్కులు పొందేందుకు అనవసరమైన ఆలస్యం జరగకుండా కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులకు న్యాయం చేసే క్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన భూముల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 12 :

ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధన కోసం ఇటీవల సమ్మె చేసిన సమయంలో ఆత్మహత్య చేసుకున్న నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఆయన కుమారుడికి ఆర్టీసీలో ఉద్యోగం ఇచ్చారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున పరిహారం అందజేశామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యావత్ ఆర్టీసీ ఉద్యోగులు ఒక రోజు వేతనం దాదాపు రూ.కోటి అందించి కుటుంబానికి అండగా నిలిచారన్నారు. ఇచ్చిన హామీ మేరకు శంకర్ గౌడ్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో రికార్డు ట్రైజర్‌గా నియమించగా నియామక పత్రాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి చేతుల మీదుగా గురువారం అందజేశారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత.. ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు దురుసుగా ప్రవర్తిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలి కానీ భౌతికంగా దాడులకు పాల్పడవద్దని ప్రయాణికులకు హితవు పలికారు. ఆర్టీసీ ఉద్యోగులపై దాడులు చేస్తే ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తుందని, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రయాణికులు మర్చిపోయిన లక్షల విలువైన వస్తువులను నిజాయతీగా తిరిగి అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు ఎందరో ఉన్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అదనపు బస్సుల ఏర్పాటు చేస్తున్నామని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఏ గ్రామానికైనా బస్సు సౌకర్యం అవసరమైతే స్థానిక అధికారులను సంప్రదించాలని, రూట్ వెరిఫికేషన్, సాధ్యాసాధ్యాల పరిశీలన అనంతరం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని మంత్రి పొన్నం తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘం నేతలు వెంకన్న, బాబురావు, ఇతర ముఖ్య నేతలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అప్పులు.. ఎల్‌నినో తిప్పలు

హైదరాబాద్, నవంబర్ 12 :

గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పులు తమ నెత్తిన పెట్టిపోయినా, ఎల్‌నినో వంటి ప్రకృతి విపత్తులు వచ్చినా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆగదని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుందన్నారు. నిరుపేదల ఆత్మగౌరవమే ఆలంబనగా 'క్యూర్' పరిధిలోని కోట్ల విలువ చేసే ప్రాంతాల్లో శంకుస్థాపనలు పూర్తి చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను వచ్చే దీపావళికల్లా పూర్తి చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో లబ్ధిదారులు ఆ ఇళ్లలో దీపావళి జరుపుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు రాజేంద్రనగర్, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారుల కోసం మైలార్‌దేవుపల్లిలో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో కలిసి మంత్రి పొంగులేటి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ పేదవాడి జీవితాశయమైన సొంత ఇంటిని ప్రభుత్వం మంజూరు చేస్తున్నదని, మరో మూడు విడతలు ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. 'క్యూర్' పరిధిలోని 23 నియోజకవర్గాలలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా, కులమతాలు, పార్టీల భేదాలు లేకుండా కేటాయింపు జరుగుతోందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఇళ్లు పొందిన లబ్ధిదారులు కంట ఆనందభాష్పాలు చూస్తుంటే ఈ ప్రభుత్వానికి, తమకు ఇంతకంటే ఇంకేం కావాలి అని అనిపిస్తోందని, వారి స్పందన చూస్తే తమకు కూడా కళ్లు చెమరుస్తున్నాయని అన్నారు. వారి ఆనందభాష్పాలే తమకు ఆశీస్సులన్నారు. గత పాలకులు పేదల ఇళ్ల నిర్మాణం విషయంలో సొల్లుపురాణం చెప్పారని, ఇప్పుడు కూడా ఇళ్ల నిర్మాణం, ఫోర్త్ సిటీ(ఫ్యూచర్ సిటీ) విషయంలో అవాకులు చవాకులు పేలుతున్నారని ఆరోపించారు. ఏది ఏమైనా ప్రజాప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు ప్రధాన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఈనెల 19 నుంచి నాణ్యమైన చిలకాకుపచ్చ రంగు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇక్కడ నిర్మించే ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించారు. తొలుత కవిత రాథోడ్ అనే మహిళకు 'సి' బ్లాక్‌లో 603 ఫ్లాట్ మంజూరు కాగా మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు కలిసి ఆమెకు సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఎండీ వి.పి. గౌతమ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, మాజీ మేయర్ పారిజాతం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు

- రాష్ట్రవ్యాప్తంగా మంజూరు పత్రాల పంపిణీ ప్రారంభం
- ఈ నెల 12 నుంచి 18 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- మహిళలకు పెద్దపీట.. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు
- నవంబర్ 19న లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ

హైదరాబాద్, నవంబర్ 12:

తెలంగాణలో మరో 4.5 లక్షల మందికి ప్రభుత్వం కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియ కొనసాగనుంది. అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాలు, మున్సిపాలిటీల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్నారు. ఏళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలు, వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులకు లబ్ధి చేకూరనుంది. కొత్తగా మంజూరైన పింఛన్లలో మహిళలకు పెద్దపీట వేయడంపై హర్షం వ్యక్తమవుతోంది. పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖతో పాటు సెర్ప్ అధికారులు ఏర్పాట్లు చేశారు. దరఖాస్తులకు సంబంధించిన అభ్యంతరాలు, సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మంజూరు పత్రాల పంపిణీ పూర్తయిన అనంతరం ఈ నెల 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కొత్త లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ సొమ్మును నేరుగా జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే 1,23,625 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేయగా, తాజా మంజూరుతో ఆ సంఖ్య 5,73,625కు చేరింది.

'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం'తో మరోసారి సత్ఫలితాలు

- సివిల్స్ తుది ఇంటర్వ్యూకు 31మంది ఎంపిక
- ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకం
- అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి భట్టి అభినందనలు

హైదరాబాద్, నవంబర్ 12 :

తెలంగాణ ప్రాంతం నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ సహకారంతో ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం మరోసారి మంచి ఫలితాలను సాధించింది. ఇటీవల విడుదలైన సివిల్స్ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తీర్ణులై 31మంది అభ్యర్థులు తుది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. సింగరేణి సంస్థ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందించేందుకు రెండు నెలల క్రితం దరఖాస్తులను ఆహ్వానించింది. వాటిల్లో 158మంది అర్హులైన అభ్యర్థులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.1.58 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించింది. ఈ ఆర్థిక సహకారంతో అభ్యర్థులు మెయిన్స్‌కు మరింత ఉత్సాహంతో సిద్ధమయ్యారు. వారిలో 31మంది తుది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం విశేషం.

ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి మరో రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకం

తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31మందికి కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ త్వరలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించనుంది. సివిల్స్ మెయిన్స్ లో ఉత్తీర్ణులై తుది ఇంటర్వ్యూకు ఎంపికైన తెలంగాణ బిడ్డలందరికీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. ఇంటర్వ్యూ దశకు చేరుకున్న అభ్యర్థులందరూ తుది పరీక్షలోనూ విజయం సాధించి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

ఇప్పటికే 27మంది సివిల్స్‌లో విజయం

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి సింగరేణి సంస్థ రెండేళ్లుగా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధుల నుంచి ఆర్థిక సహకారం అందిస్తోంది. ఈ పథకం ద్వారా మొదటి ఏడాది ఏడుగురు, రెండో ఏడాది 20మంది చొప్పున మొత్తం 27మంది సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించడం విశేషం. ఈ ఏడాది కూడా అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు తుది ఇంటర్వ్యూలో విజయం సాధించి సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలని, వీరికి ప్రభుత్వం ఆధ్వర్యంలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించబోతున్నట్లు, ఈ ఇంటర్వ్యూల నిర్వహణకు కూడా సింగరేణి సంస్థ తన సహకారాన్ని అందిస్తుందని సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు.

వరంగల్ నుంచి అత్యధికంగా ఆరుగురు

ఈసారి తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31మందిలో అత్యధికంగా వరంగల్ జిల్లా నుంచి ఆరుగురు ఉన్నారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి ముగ్గురేసి, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల నుంచి ఇద్దరేసి చొప్పున ఎంపికయ్యారు. అదిలాబాద్, నారాయణపేట, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మంచిర్యాల జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున తుది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. వీరిలో 18మంది ఓబీసీ వర్గాల వారు, ఎస్టీలు ఇద్దరు, ఎస్సీలు ముగ్గురు, 8మంది జనరల్ అభ్యర్థులు ఉన్నారు.

'డోర్ స్టెప్ డెలివరీ' మరింత చేరువ

- మీ సేవ, సైబరాబాద్ మున్సిపల్, పోలీస్, సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్త కార్యక్రమం

హైదరాబాద్, నవంబర్ 12 :

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా మీ సేవ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం విజయవంతమైంది. సైబరాబాద్ పరిధిలో ఉన్న రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులతో ఉన్నతాధికారులు పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ, మీ సేవ కమిషనర్ టి.రవికిరణ్ హాజరయ్యారు. ప్రభుత్వ సేవలు ప్రజల ఇంటి వద్దకే కార్యక్రమంలో భాగంగా మీ సేవ అందిస్తున్న డోర్‌స్టెప్ డెలివరీ(డీఎస్‌డీ) సేవల గురించి కమిషనర్ రవికిరణ్ ప్రత్యేకంగా వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు దార్శనికతతో పౌరసేవలు అత్యంత సులువుగా అందుతున్నాయని తెలిపారు. ప్రజలు మీ సేవ కేంద్రాలకు వెళ్లకుండానే తమ ఇంటి వద్ద నుంచే వివిధ ప్రభుత్వ సేవలను పొందే అవకాశం డోర్ స్టెప్ సర్వీసుల ద్వారా లభిస్తుందన్నారు. బిజీగా ఉండే ఐటీ ప్రొఫెషనల్స్‌తోపాటు, మీ సేవ కేంద్రాల దాకా వెళ్లలేని వృద్ధులకూ ఈ సౌకర్యం ఉపయోగపడుతుందన్నారు. 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఈ సేవలను పొందవచ్చని, జనన, మరణ ధృవీకరణ పత్రాల్లో సవరణలు, పిల్లల పేర్ల నమోదు, కుల ధ్రువీకరణ పత్రాలు, జనన తేదీ ధ్రువీకరణ పత్రాలు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, గ్యాప్ సర్టిఫికెట్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, Oద్యు సర్టిఫికెట్లు తదితర సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చు ఆదా చేయడంతోపాటు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంలో ఈ విధానం కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పౌర సేవలను సులభతరం చేసి అందించటంలో మీ సేవ చొరవను కమిషనర్ సృజన మెచ్చుకున్నారు. తగిన ప్రచారం కల్పించటం ద్వారా ఈ సేవలు పొందాలని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లను కోరారు. ప్రభుత్వ శాఖలు, పోలీస్ విభాగం, మున్సిపల్ సంస్థలు, సాంకేతిక సేవా సంస్థలు, నివాస సముదాయాల మధ్య సమన్వయం పెంపొందించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని పోలీస్ కమిషనర్ రమేష్ తెలిపారు.

ప్రజా రవాణా వ్యవస్థ వినియోగం మరింతగా పెరగాలి

సైబరాబాద్ పరిధిలోని పౌరులు ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా వినియోగించడంపై దృష్టి పెట్టాలని కమిషనర్ రమేష్ కోరారు. సైబరాబాద్ మూవ్స్ పేరుతో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు, ప్రత్యేక లూప్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల మద్దతు కూడా కావాలని కోరారు.

ప్రజా రవాణా, ఆన్‌లైన్ బుకింగ్ సేవలకు డిజిటల్ పరిష్కారం

మీ టికెట్ యాప్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న డిజిటల్ సేవలను కూడా కార్యక్రమంలో వివరించారు. ఈ యాప్ ద్వారా కొత్త బస్ పాస్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడం, రెన్యువల్, టీజీఎస్ ఆర్టీసీ బస్ టికెట్ సేవలు, హైదరాబాద్ మెట్రో రైల్ టికెట్ బుకింగ్, నెహ్రూ జూపార్కుతోపాటు, ఇతర పార్కులు, సందర్శనీయ స్థలాల ప్రవేశ టికెట్లను నేరుగా ఈ యాప్ నుంచే ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునే సౌకర్యాలను పౌరులు వినియోగించుకోవచ్చని తెలియజేశారు. డిజిటల్ సాంకేతికత ద్వారా ప్రజా రవాణా, వినోద, ఇతర పౌర సేవలను సులభంగా పొందేలా చేయడం ఈ యాప్ ప్రధాన ఉద్దేశమని వివరించారు.

రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల భాగస్వామ్యానికి పిలుపు

ఈ కార్యక్రమంలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రస్తుతం 'క్యూర్' పరిధిలో అమలవుతున్న డోర్ స్టెప్ సర్వీసుల సేవలను పొందేందుకు గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్ అసోసియేషన్లు భాగస్వాములు కావాలని అధికారులు ఆహ్వానించారు. ప్రతీ నివాస సముదాయంలోని ప్రజలకు మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ, మీ టికెట్ యాప్, ఇతర ప్రభుత్వ, పౌర సేవలపై అవగాహన కల్పించడంలో అసోసియేషన్లు వారధిగా నిలవాలని సూచించారు. ప్రభుత్వ చొరవను, ఐటీ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేన్ల ప్రతినిధులు ప్రశంసించారు.



ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలపై ప్రభుత్వం కొరడా

హైదరాబాద్, నవంబర్ 12 :

రాష్ట్రంలో మరో ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. డిఫెన్సర్ సెక్యూరిటీ సర్వీసెస్ లైసెన్స్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు లైసెన్స్ రద్దు తక్షణమే అమల్లోకి వచ్చేలా కంట్రోలింగ్ అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. భద్రతా సిబ్బంది నియామకాల్లో నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్న కారణంతో తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ సెక్యూరిటీ ఏజెన్సీలపై దాడులు చేస్తోంది. ఇటీవలే ఓ ఏజెన్సీ లైసెన్స్‌ను రద్దు చేసిన ప్రభుత్వం.. తాజాగా మరో ఏజెన్సీ అయిన డిఫెన్సర్ సెక్యూరిటీ సర్వీసెస్ లైసెన్స్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. లైసెన్స్ రద్దు ఉత్తర్వులు తక్షణమే అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఏడు రోజుల్లో ఒరిజినల్ లైసెన్స్‌ను ప్రభుత్వానికి అప్పగించాలని డిఫెన్సర్ సెక్యూరిటీ సర్వీసెస్‌కు ఆదేశాలు జారీ చేసింది. లైసెన్స్ రద్దుకు భద్రతా సిబ్బంది నియామకంలో తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలే కారణమని కంట్రోలింగ్ అథారిటీ తెలిపింది. పోలీస్ వెరిఫికేషన్ లేకుండానే సెక్యూరిటీ గార్డులను నియమిస్తున్నట్లు.. ఎటువంటి శిక్షణ లేకుండానే సిబ్బందిని విధుల్లోకి పంపినట్లు గుర్తించామని అధికారులు వెల్లడించారు.

కుల్గామ్ దాడికి కొత్త ఉగ్ర సంస్థ బాధ్యత

- పస్దరాన్-ఎ-హుర్రియత్ కశ్మీర్ పేరుతో ప్రకటన
- సీఆర్పీఎఫ్ చెక్‌పోస్టుపై కాల్పుల్లో ముగ్గురికి గాయాలు
- ఆర్ఎస్ఎస్, భారత ప్రభుత్వమే లక్ష్యమంటూ హెచ్చరిక
- దాడి దృశ్యాలు విడుదల.. ఉగ్రవాదుల కోసం గాలింపు

శ్రీనగర్:

జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో సీఆర్పీఎఫ్ సిబ్బందిపై జరిగిన కాల్పుల ఘటనకు కొత్తగా వెలుగులోకి వచ్చిన ఓ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించింది. పస్దరాన్‌ఎహుర్రియత్ కశ్మీర్ (Pasdaran eHurriyat Kashmir) పేరుతో ఈ ప్రకటన విడుదలైంది. కశ్మీర్ లోయలో ఉగ్ర వాద కార్యకలాపాలకు సంబంధించి ఈ సంస్థ పేరు తొలిసారిగా తెరపైకి రావడంతో భద్రతా వర్గాల్లో చర్చ మొదలైంది.

బుధవారం కుల్గామ్ జిల్లాలోని మీర్ బజార్ సమీపంలో సీఆర్పీఎఫ్ చెక్‌పోస్టుపై మోటార్‌సైకిల్‌పై వచ్చిన దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో ఈ దాడి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. నవంబర్ 11న విడుదల చేసిన ప్రకటనలో ఈ దాడికి తామే బాధ్యులమని పస్దరాన్‌ఎహుర్రియత్ కశ్మీర్ పేర్కొంది. భవిష్యత్తులో మరిన్ని దాడులు చేస్తామని, ఆర్ఎస్ఎస్‌తో పాటు భారత ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. సంస్థ ప్రతినిధిగా చెప్పుకుంటున్న మొహమ్మద్ ఒమర్ అజ్జామ్ పేరుతో ఈ ప్రకటన వెలువడింది. అయితే, సంస్థ ప్రకటించిన బాధ్యత, బెదిరింపుల విశ్వసనీయతపై భద్రతా సంస్థలు పరిశీలన జరుపుతున్నాయి.

ఇదిలా ఉండగా, కుల్గామ్ దాడికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. కాల్పులు జరిగిన వెంటనే సీఆర్పీఎఫ్ సిబ్బంది అప్రమత్తమై పరిసర ప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు వాటిలో కనిపిస్తోంది. గాయపడిన సహచరులకు సాయం చేసేందుకు ఇతర సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. భద్రతా బలగాల వేగవంతమైన స్పందనతో దుండగుల తదుపరి ప్రయత్నాలకు అడ్డుకట్ట పడినట్లు అధికారులు భావిస్తున్నారు. దాడి నేపథ్యంలో కుల్గామ్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. దుండగులు పారిపోయిన మార్గాలను గుర్తించేందుకు గాలింపు చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలు, స్థానికుల నుంచి సేకరించిన సమాచారం, నిఘా ఆధారాలతో దర్యాప్తు కొనసాగుతోంది. కొత్తగా తెరపైకి వచ్చిన సంస్థ వెనుక ఎవరున్నారు? దానికి సభ్యులు ఎంతమంది? ఇతర ఉగ్రవాద నెట్‌వర్క్‌లతో సంబంధాలున్నాయా? అనే కోణాల్లో భద్రతా సంస్థలు ఆరా తీస్తున్నాయి.

మీడియా దేశాభివృద్ధికి తోడ్పడాలి: ప్రధాని మోదీ

- 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే లక్ష్యం
- డ్రగ్స్ రహిత భారత్, జాతీయ ఐక్యతపై కథనాలు రావాలి
- గత 12 ఏళ్లలో దేశంలో గణనీయమైన మార్పులు
- సాంకేతికతతో మారుతున్న మీడియా రంగం
- మీడియా ప్రతినిధులతో దీపావళి మిలన్‌లో ప్రధాని ముచ్చట్లు

న్యూఢిల్లీ:

ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సానుకూల దృక్పథంతో వార్తలు, కథనాలు అందిస్తూ దేశాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని మీడియా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ప్రపంచానికి భారతదేశ విజయాలను పరిచయం చేయడంలో మీడియా చొరవ చూపాలని సూచించారు. వివిధ రంగాల్లో దేశం సాధిస్తున్న పురోగతితోపాటు ప్రతిభావంతులైన వ్యక్తుల విజయాలను ప్రత్యేక కథనాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఇదే దేశానికి మీడియా అందించే గొప్ప సేవ అని పేర్కొన్నారు.

ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన దీపావళి మిలన్ కార్యక్రమంలో ప్రధాని మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి వికసిత్ భారత్

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మోదీ స్పష్టం చేశారు. వార్తలకు డెడ్‌లైన్ ఉన్నట్లుగానే వికసిత్ భారత్ సాధనకు కూడా 2047 లక్ష్య గడువుగా నిర్ణయించుకున్నామని వ్యాఖ్యానించారు. ఈ దిశగా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. సంకల్పంతో పనిచేస్తే దేశం నిర్దేశించుకున్న లక్ష్యాలేవీ అసాధ్యం కావని ధీమా వ్యక్తం చేశారు.

డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం, జాతీయ ఐక్యత బలోపేతం వంటి అంశాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. దేశంలో చోటుచేసుకుంటున్న సానుకూల మార్పులు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అంతర్జాతీయ వేదికపై భారత్ సాధిస్తున్న విజయాలు ప్రపంచానికి తెలిసేలా కథనాలు ప్రచురించాలని ఆకాంక్షించారు.

12 ఏళ్లలో గణనీయమైన మార్పులు

గత 12 ఏళ్లలో దేశంలో అనేక రంగాల్లో పురోగతి సాధించామని ప్రధాని వివరించారు. ఒకప్పుడు కనీసం మట్టి రోడ్డు నిర్మించాలని ప్రభుత్వాలకు వినతులు సమర్పించాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మించే స్థాయికి చేరుకున్నామని గుర్తుచేశారు. రైల్వే వ్యవస్థలో పూర్తిస్థాయి విద్యుదీకరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ కాలంలో 50 కోట్ల మందిని అత్యంత పేదరికం నుంచి బయటపడేయగలిగామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.



క్షేత్రస్థాయిలో కుటుంబాలను సైతం పక్కనపెట్టి విధులు నిర్వర్తించే ఫీల్డ్ రిపోర్టర్ల అంకితభావం తనకు స్ఫూర్తినిస్తుందని మోదీ అన్నారు. దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించాలని, నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మీడియాతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మోదీ

మీడియా ప్రతినిధులతో తనకున్న అనుబంధాన్ని ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. బ్రేకింగ్ న్యూస్ కోసం నిత్యం పరుగులు తీసే జర్నలిస్టులు నాన్ బ్రేకింగ్ న్యూస్ కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందంటూ చమత్కరించారు. గతంలో ప్రెస్ రిలీజ్ పంపించేందుకు కూడా ఎంతో కష్టపడాల్సి వచ్చేదని తెలిపారు. అప్పట్లో మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సంబంధాలు ఉండేవని, వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెప్పారు. రిపోర్టర్ నుంచి ఎడిటర్‌గా ఎదిగినట్లుగా తన బాధ్యతలు కూడా మారాయని వ్యాఖ్యానించారు.

గతంలో జరిగిన ఓ ఆసక్తికర ఘటనను కూడా పంచుకున్నారు. తాను ముఖ్యమంత్రి కాబోతున్ననే విషయం తెలుసుకున్న మహిళా మీడియా ప్రతినిధుల బృందం ఒకసారి తన వద్దకు వచ్చిందని చెప్పారు. ఆ సందర్భంగా మిఠాయి తినిపించాలని వారు కోరారని, తనకంటే ముందుగానే వారికి ఆ విషయం తెలిసిందని సరదాగా గుర్తుచేసుకున్నారు.

సాంకేతికతతో మారుతున్న మీడియా రంగం

సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో మీడియా పని విధానంలో సమూల మార్పులు వచ్చాయని మోదీ అన్నారు. అదే సమయంలో కొత్త సవాళ్లు కూడా ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో వార్తల సేకరణకు భారీ పరికరాలు అవసరమయ్యేవని, ప్రస్తుతం మొబైల్ ఫోన్‌నే ఓబీ యూనిట్‌గా ఉపయోగించే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మీడియా తనను తాను మార్చుకోవాలని సూచించారు. దేశాభివృద్ధి, ప్రజాస్వామ్య పటిష్ఠత, జాతీయ ఐక్యత వంటి అంశాలపై మీడియా మరింత దృష్టి సారించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.



యూపీలో ఒవైసీ, చంద్రశేఖర్ కొత్త కూటమి

- 'సామాజిక పరివర్తన మోర్చా' పేరుతో ఏర్పాటు
- సీఎం అభ్యర్థిగా చంద్రశేఖర్ ఆజాద్ ప్రకటన
- ఎస్పీ, కాంగ్రెస్‌కు కలిసి రావాలని ఆహ్వానం
- 2027 ఎన్నికల్లో అధికార మార్పే లక్ష్యం

లక్నో:

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కొత్త కూటమి ఏర్పాటైంది. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం, చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీ కలిసి 'సామాజిక పరివర్తన మోర్చా'ను ప్రకటించాయి. ఈ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రశేఖర్ ఆజాద్ పేరును ఒవైసీ వెల్లడించారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, ముస్లింలపై అణచివేత కొనసాగుతోందని చంద్రశేఖర్ ఆరోపించారు. రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం పోరాడతామని స్పష్టం చేశారు. బీజేపీని ఓడించేందుకు ఎస్పీ, కాంగ్రెస్ కూడా తమతో కలిసిరావాలని ఆహ్వానించారు. 2027 ఎన్నికల్లో అధికార మార్పు తీసుకురావడమే లక్ష్యమన్నారు. మరోవైపు, ముస్లిం ఓట్లను పొందుతున్న అఖిలేశ్ యాదవ్ వల్ల బీజేపీని ఓడించడం సాధ్యం కాదని ఒవైసీ విమర్శించారు. చంద్రశేఖర్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించడంతో ఎస్పీ నేతల్లో అందోళన మొదలైందని వ్యాఖ్యానించారు. తన భద్రత తొలగించినా తన గొంతును ఆపలేరని స్పష్టం చేశారు. యూపీలోని మొత్తం 403 అసెంబ్లీ స్థానాల్లో తమ కూటమి పోటీ చేస్తుందని చంద్రశేఖర్ ప్రకటించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఇద్దరు నేతలు వెల్లడించారు.

విదేశీ విడాకులతో భారత్‌లో రెండో పెళ్లి చెల్లదు: సుప్రీంకోర్టు

- విదేశీ కోర్టుల విడాకులకు ఆటోమేటిక్‌గా గుర్తింపు ఉండదు
- భారతీయ చట్టాల నిబంధనలు పాటిస్తేనే చెల్లుబాటు
- మొదటి వివాహం కొనసాగితే బహుభార్యత్వం కేసులు
- రెండో పెళ్లికి ముందు విడాకుల ఉత్తర్వుల పరిశీలన తప్పనిసరి

న్యూఢిల్లీ:

విదేశాల్లో విడాకులు తీసుకున్నంత మాత్రాన భారత్‌లో మొదటి వివాహం రద్దయినట్లు భావించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విదేశీ న్యాయస్థానాలు మంజూరు చేసిన విడాకులకు భారతదేశంలో ఆటోమేటిక్‌గా చట్టబద్ధత లభించదని తేల్చిచెప్పింది. భారతీయ చట్టాలు నిర్దేశించిన నిబంధనలు, షరతులకు అనుగుణంగా ఉన్నప్పుడే వాటికి గుర్తింపు ఉంటుందని పేర్కొంది. అలాంటి విడాకుల ఆధారంగా భారత్‌లో రెండో వివాహం చేసుకుంటే బహుభార్యత్వం (బిగామీ) కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

ఉద్యోగం, వ్యాపారం ఇతర కారణాలతో విదేశాలకు వెళ్లి అక్కడ కొంతకాలం నివసించిన తర్వాత స్థానిక న్యాయస్థానాల ద్వారా విడాకులు పొందుతున్న భారతీయులు చాలామంది ఉన్నారు. అయితే ఆ ఉత్తర్వుల ఆధారంగా స్వదేశంలో మరో వివాహం చేసుకోవచ్చా అనే సందేహాల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ న్యాయ సూత్రాలను స్పష్టం చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం సివిల్ ప్రొసీజర్ కోడ్ (సీపీసీ), 1908లోని సెక్షన్ 13 నిబంధనలను ప్రస్తావించింది. విదేశీ కోర్టుల తీర్పులు భారత్‌లో గుర్తింపు పొందాలంటే అవి నిర్దేశిత చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొంది.

ప్రతి కారణంతో విడాకులు చెల్లవు

హిందూ వివాహ చట్టం, 1955 ప్రకారం వివాహం చేసుకున్న దంపతుల విషయంలో విదేశీ కోర్టుల విడాకుల ఉత్తర్వులను భారతీయ చట్టాల ప్రకారం పరిశీలించాల్సి ఉంటుంది. వివాహ బంధం కోలుకోలేని విధంగా విచ్ఛిన్నమైందనే కారణంతో విదేశీ న్యాయస్థానం విడాకులు మంజూరు చేసినంత మాత్రాన భారత్‌లో అవి చెల్లుబాటు కావు. ఎందుకంటే ఈ కారణం హిందూ వివాహ చట్టం కింద సాధారణంగా విడాకులు మంజూరు చేయడానికి స్వతంత్ర ప్రాతిపదిక కాదు. అందువల్ల విదేశాల్లో విడాకులు పొందినవారు తమ మొదటి వివాహం పూర్తిగా ముగిసిపోయిందని భావించి రెండో పెళ్లికి తొందరపడకూడదు. విడాకులు మంజూరు చేసిన కారణాలు భారతీయ చట్టాలు గుర్తించినవేనా కాదా అనేది ముందుగా నిర్ధారించుకోవాలి.

రెండో పెళ్లతో చట్టపరమైన చిక్కులు

భారతీయ చట్టాల ప్రకారం మొదటి వివాహం కొనసాగుతున్న సమయంలో మరో వివాహం చేసుకుంటే చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. విదేశీ కోర్టు విడాకుల ఉత్తర్వును చూపించినంత మాత్రాన బహుభార్యత్వం ఆరోపణల నుంచి మినహాయింపు లభించదు.



మొదటి వివాహం భారత్‌లో చట్టబద్ధంగా రద్దు కాలేదని తేలితే సంబంధిత చట్టాల ప్రకారం క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చు. వివాహం తర్వాత విదేశీ పౌరసత్వం పొందినప్పటికీ ఈ నిబంధనల్లో మార్పు ఉండదు. విదేశాల్లో విడాకులు తీసుకోవడం, తిరిగి భారత్‌కు వచ్చి మరో వివాహం చేసుకోవడం వల్ల మొదటి వివాహం దానంతట అదే రద్దయినట్లు కాదని స్పష్టం చేసింది.

విదేశీ విడాకులకు గుర్తింపు రావాలంటే..

విదేశీ న్యాయస్థానం ఇచ్చిన విడాకుల ఉత్తర్వులకు భారత్‌లో గుర్తింపు లభించాలంటే కొన్ని కీలక నిబంధనలు పాటించాలి. విడాకులకు ప్రాతిపదికగా చూపిన కారణం భారతీయ చట్టాలు అంగీకరించినదై ఉండాలి. క్రూరత్వం, జీవిత భాగస్వామిని విడిచిపెట్టడం, వ్యభిచారం వంటి చట్టబద్ధమైన కారణాలతో పాటు, సంబంధిత చట్టం అనుమతించే సందర్భాల్లో పరస్పర అంగీకారంతో పొందిన విడాకులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. మరో జీవిత భాగస్వామికి సరైన సమాచారం ఇవ్వకుండా, వారి వాదనలు వినకుండా ఏకపక్షంగా తీర్పు ఇచ్చినా దానికి గుర్తింపు లభించకపోవచ్చు. విదేశీ కోర్టుకు సంబంధిత కేసుపై అధికార పరిధి ఉండటం, సహజ న్యాయ సూత్రాలను పాటించడం తప్పనిసరి. ఇరు పక్షాలకు తమ వాదనలు వినిపించే అవకాశం కల్పించాలి. మోసం, తప్పుడు సమాచారం లేదా అక్రమ మార్గాల ద్వారా పొందిన విడాకుల ఉత్తర్వులకు కూడా భారత్‌లో చట్టబద్ధత ఉండదు.

రెండో వివాహానికి ముందు న్యాయపరిశీలన

విదేశాల్లో విడాకులు పొందినవారు భారత్‌లో మరో వివాహం చేసుకునే ముందు తమ విడాకుల ఉత్తర్వుల చట్టబద్ధతను నిర్ధారించుకోవాలి. సీపీసీ సెక్షన్ 13 నిబంధనలతో పాటు సంబంధిత వ్యక్తిగత చట్టాలకు ఆ ఉత్తర్వు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించాలి. ముఖ్యంగా హిందూ వివాహ చట్టం పరిధిలోకి వచ్చే దంపతులు న్యాయ నిపుణుల సలహా తీసుకోవడం అవసరం. లేకపోతే రెండో వివాహం కారణంగా క్రిమినల్ కేసులు, ఇతర న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

మదురై తనిష్క్ షోరూమ్‌లో
రూ.50 కోట్ల ఆభరణాల చోరీ

- 15 నుంచి 20 కిలోల బంగారం, వజ్రాభరణాలు అపహరణ
- కొత్తగా ప్రారంభమైన షోరూమ్‌ను లక్ష్యంగా చేసుకున్న దుండగులు
- గోడకు కన్నం వేసి లోపలికి ప్రవేశించిన దొంగ
- సీసీటీవీ ఫుటేజీలో ఒక్క అనుమానితుడి కదలికలు

మదురై, నవంబర్ 12:

తమిళనాడులోని మదురైలో భారీ నగల చోరీ కలకలం రేపింది. పళంగనాథం ప్రాంతంలోని ప్రముఖ తనిష్క్ జువెలరీ షోరూమ్‌లో దుండగులు సుమారు రూ.50 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలను అపహరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 15 నుంచి 20 కిలోల వరకు బంగారం చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ఈ షోరూమ్‌ను కేవలం 10 నుంచి 15 రోజుల క్రితమే ప్రారంభించారు. భవన నిర్మాణ పనులు ఇంకా 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఇదే పరిస్థితిని ఆసరాగా చేసుకున్న దుండగులు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. షోరూమ్ వెనుక వైపు తలుపులు, షట్టర్ తాళాలను పగలగొట్టడంతో పాటు గోడకు కన్నం వేసి లోపలికి ప్రవేశించినట్లు నిర్వాహకులు గుర్తించారు.

11వ తేదీ ఉదయం సిబ్బంది షోరూమ్‌కు చేరుకున్నప్పుడు తలుపులు ధ్వంసమై ఉండటాన్ని గమనించారు. లోపల పరిశీలించగా విలువైన ఆభరణాలు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. షోరూమ్‌లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా, ఒక అనుమానితుడు భవనం పైఅంతస్తులోని లిఫ్ట్ మార్గం ద్వారా లోపలికి ప్రవేశించినట్లు గుర్తించారు. నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో భద్రతాపరమైన లోపాలను ఆసరాగా చేసుకుని ఈ చోరీకి పథకం వేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అపహరణకు గురైన ఆభరణాల కచ్చితమైన పరిమాణం, విలువపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు.

బంగ్లాదేశ్‌లో మళ్లీ హింసాత్మక ఆందోళనలు

- ఢాకాతో పాటు పలు జిల్లాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- బస్సులు, ట్రక్కులకు నిప్పు.. నాటుబాంబుల పేలుళ్లు
- అల్లర్ల వెనుక అవామీ లీగ్ ఉందంటున్న అధికార బీఎన్పీ
- హింసకు ప్రభుత్వమే కారణమంటున్న జమాతే ఇస్లామీ

ఢాకా, నవంబర్ 12:

బంగ్లాదేశ్‌లో మరోసారి హింసాత్మక పరిస్థితులు నెలకొన్నాయి. వీధుల్లో నాటుబాంబుల పేలుళ్లు, వాహనాలకు నిప్పంటించడం, రహదారుల దిగ్బంధం, నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. రాజధాని ఢాకాతో పాటు గోపాల్‌గంజ్, షరియత్‌పూర్ తదితర జిల్లాల్లో కొన్ని వారాలుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. డిసెంబర్‌లో స్వదేశానికి తిరిగి వస్తానని మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



2024 ఆగస్టులో జరిగిన హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో షేక్ హసీనా దేశాన్ని విడిచిపెట్టి భారత్‌కు వెళ్లిపోయారు. తాజాగా ఆమె స్వదేశానికి తిరిగి వస్తానని ప్రకటించడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రస్తుత అల్లర్ల వెనుక హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ఉందని అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) ఆరోపిస్తోంది. గురువారం తెల్లవారుజామున కుష్టియా నియోజకవర్గానికి చెందిన మహిళా రిజర్వ్‌డ్ స్థానంలో ఎన్సీసీ ఎంపీగా ఉన్న నుస్రత్ తబస్సుమ్ ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి నిప్పంటించారు. ఈ ఘటనకు అవామీ లీగ్ కార్యకర్తలే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంతకుముందు నవంబర్ 11న ఢాకాలో రెండు బస్సులు, ఒక ట్రక్కుకు దుండగులు నిప్పంటించారు. నవంబర్ 9, 10 తేదీల్లో దేశవ్యాప్తంగా కనీసం 22 అగ్నిప్రమాదాలు, నాటుబాంబుల పేలుళ్లు నమోదయ్యాయి. దీంతో భద్రతా బలగాలు అప్రమత్తమై వందలాది మందిని అరెస్టు చేశాయి. అవామీ లీగ్ విద్యార్థి విభాగమైన బంగ్లాదేశ్ ఛాత్ర లీగ్ నవంబర్ 10న దేశవ్యాప్త దిగ్బంధానికి పిలుపునివ్వడం రాజకీయ ఉద్రిక్తతలను మరింత పెంచింది.

మరోవైపు అల్లర్లకు అధికార బీఎన్పీనే కారణమని జమాతే ఇస్లామీ నేతలు ఆరోపిస్తున్నారు. షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వస్తారనే అంశాన్ని సాకుగా చూపి బీఎన్పీ హింసాత్మక చర్యలకు పాల్పడుతోందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వమే దేశంలో అశాంతిని ప్రోత్సహిస్తోందని ఆరోపణలు చేస్తున్నారు. దీంతో అల్లర్లకు బాధ్యులెవరనే అంశంపై ప్రధాన రాజకీయ పార్టీల మధ్య పరస్పర విమర్శలు కొనసాగుతున్నాయి.

వస్త్ర పరిశ్రమ కార్మికుల ఆందోళనలు

రెడీమేడ్ వస్త్ర పరిశ్రమలో కార్మికుల నిరసనలు కూడా దేశంలో హింసాత్మక పరిస్థితులకు మరో కారణంగా మారాయి. ప్రస్తుతం నెలకు 12,500 టాకాలుగా ఉన్న కనీస వేతనాన్ని 30 వేల టాకాలకు పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అక్టోబర్ చివరి వారం నుంచి నవంబర్ మొదటి వారంలో ఢాకా, గాజీపూర్, సావర్ ప్రాంతాల్లో ఈ ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. కార్మికులు, పోలీసుల మధ్య పలుచోట్ల ఘర్షణలు జరిగాయి. ఈ నిరసనల వెనుక అవామీ లీగ్ అనుబంధ కార్మిక సంఘాలు, ఆ పార్టీతో సంబంధాలున్న ఫ్యాక్టరీ యజమానుల హస్తం ఉందని బంగ్లాదేశ్ హోంమంత్రి సలాహుద్దీన్ అహ్మద్ ఆరోపించారు. దీంతో రాజకీయ వివాదాలతో పాటు కార్మికుల సమస్యలు కూడా దేశంలో అశాంతికి దారితీస్తున్నాయి.

ఎంబీబీఎస్ సీటు సాధించిన చందనకు ఆర్థిక చేయూత

- చిటుకుల లక్ష్మమ్మ రాంరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.27 వేల ఆర్థిక సాయం అందజేత
- విద్యార్థులకు చందన ఆదర్శంగా నిలవాలి.. చిటుకుల మైపాల్ రెడ్డి..



గజ్వేల్ ప్రతినిధి (కొండపాక), నవంబర్ 12, :

పేదరికం విద్యకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిటుకుల మైపాల్ రెడ్డి. కొండపాక మండల కేంద్రానికి చెందిన కొమ్ము చందన ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆమె చదువుకు ఆర్థిక చేయూత అందించారు. మైపాల్ రెడ్డి తన తల్లిదండ్రులైన లక్ష్మమ్మ, రాంరెడ్డి పేర్లతో ఏర్పాటు చేసిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.27 వేల నగదును గురువారం చందనకు అందజేశారు. తన కుమారుడు మణిదీప్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ట్రస్ట్ తరఫున ఆమె మొదటి సంవత్సరం ఫీజు నిమిత్తం ఈ ఆర్థిక సాయాన్ని అందించడం విశేషం. ఈ సందర్భంగా మైపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చందనను ఆదర్శంగా తీసుకొని పట్టుదల, కష్టపడి చదివే తత్వంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యతోనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందన తండ్రి నర్సింలు, తమ్ముడు సతీష్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంట్రాక్టు లెక్చరర్ మృతి




దుబ్బాక టౌన్, నవంబర్ 12, :

దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్ గా పనిచేస్తున్న మన్నె రఘునందన్ (46) గుండెపోటుతో మృతి చెందారు. రఘునందన్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వొకేషనల్ కోర్సు సీజీటీ గ్రూపులో 15 సంవత్సరాల నుంచి కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ గా పనిచేస్తున్నాడు. కళాశాలకు యధావిధిగానే హాజరైన రఘునందన్ 12 గంటల ప్రాంతంలో తను కూర్చున్న చోటనే కింద పడిపోవడంతో సహచర ఉపన్యాసకులు వెంటనే పైకి లేపి, సీపీఆర్ చేస్తూ దుబ్బాక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు మరోసారి సీపీఆర్ చేసి, చికిత్స చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. రఘునందన్ ఆకస్మిక మృతి పట్ల కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య, కళాశాల లెక్చరర్లు తీవ్ర సంతాపం వెలిబుచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కళాశాలలో రెండు నిమిషాలు మౌనం పాటించి, ఆకస్మిక సెలవు ప్రకటించారు. రఘునందన్ మృతి పట్ల పలువురు లెక్చరర్లు ఉపాధ్యాయులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రఘునందన్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన సంగారెడ్డి మండలం తాళ్లపల్లికి తరలించారు.

ఎన్.ఆర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభం

ప్రారంభోత్సవంలో పాల్గొన్న పులిమామిడి రాజు

నిర్వాహకులకు శుభాకాంక్షలు



సదాశివపేట, నవంబర్, 12, :

నవాబుపేట గ్రామానికి చెందిన దాస నర్సింలు–ఉమారాణి దంపతులు నూతనంగా నిర్మించిన డి.ఎన్.ఆర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన దాస నర్సింలు–ఉమారాణి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ వివాహాలు, శుభకార్యాలు, ఇతర వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా అన్ని సౌకర్యాలతో కన్వెన్షన్ హాల్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ హాల్ స్థానిక ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నిర్వాహకులకు వ్యాపారంలో మంచి అభివృద్ధి, పేరు ప్రఖ్యాతులు లభించాలని ఆకాంక్షించారు.

నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- సిబ్బంది ఆరోగ్యం, విధి నిర్వహణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి
- ఐజీ చంద్రశేఖర్ రెడ్డి
- పోలీస్ స్టేషన్ పనితీరుపై ఐజీ చంద్రశేఖర్ రెడ్డి క్షేత్రస్థాయి సమీక్ష



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, :

పోలీసు వ్యవస్థలో సమర్థవంతమైన పనితీరు, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పోలీసు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి తనిఖీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా మల్టీ జోన్-1 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) చంద్రశేఖర్ రెడ్డి గురువారం సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఐజీకి సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఐజీ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.

సిబ్బంది సమస్యలపై ఆరా.. శాంతిభద్రతలపై సమీక్ష

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఐజీ ప్రత్యేకంగా మాట్లాడి వారి విధి నిర్వహణ తీరును తెలుసు కున్నారు. విధి నిర్వహణలో ఎదురవు తున్న ఇబ్బందులు, వ్యక్తిగత, వృత్తిపర మైన సమస్యలపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితి, తరచూ నమోదవుతున్న నేరాలు, వాటి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు విధుల్లోనూ అనేక మార్పులు చోటుచే సుకుంటున్నాయని, పాతకాలంతో పోలిస్తే ప్రస్తుతం పోలీసు వ్యవస్థ మరింత ఆధునికంగా మారిందని ఐజీ పేర్కొన్నారు. అదే సమయంలో నేరాల స్వరూపం కూడా మారుతున్న నేపథ్యంలో ముఖ్యంగా పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిరంతరం అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. వివిధ రకాల నేరాల పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

సిబ్బంది ఆరోగ్యమే విధి నిర్వహణకు బలం

పోలీసు సిబ్బంది నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఐజీ సూచించారు. విధి నిర్వహణతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, ఆరోగ్య ప్రొఫైలింగ్ చేయించుకోవాలని తెలిపారు. ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఉన్నా, వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లినా ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు.

రికార్డుల పరిశీలన.. కేసుల దర్యాప్తుపై ఆరా

అనంతరం పోలీసు సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించి వాటి నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణలో ఉన్న కేసులకు సంబంధించిన వాహనాలను తనిఖీ చేశారు. రిసెప్షన్ విభాగం పనితీరు, ప్రతి సంవత్సరం స్టేషన్‌కు అందుతున్న ఫిర్యాదుల సంఖ్య, వాటిపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. స్టేషన్ రికార్డులు, క్రైమ్ రిజిస్టర్లు, పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, న్యాయస్థానాల్లో విచారణ దశలో ఉన్న కేసుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తు ప్రక్రియలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను (ఎస్ఓపీ) కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రోత్సాహం

అసాంఘిక శక్తుల కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, సైబర్ నేరాలు, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించి, గ్రామాల్లో వాటి ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. ఈ తనిఖీల్లో సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్, ఏసీపీ రవీందర్ రెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ విద్యాసాగర్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్, లతీఫ్, రాజగోపా ల్‌పేట ఎస్ఐ వివేక్, చిన్నకోడూరు ఎస్ఐ చంద్రమోహన్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కన్నపేట వార్డు మెంబర్ల ఫోరం మండల అధ్యక్షుడిగా బత్తుల సతీష్ ఏకగ్రీవ ఎన్నిక

- వార్డు మెంబర్ల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా.. బత్తుల సతీష్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి / సయ్యద్ జహీర్ / నవంబర్ 12 :

తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం అక్కన్నపేట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు ముక్క అనిల్, జిల్లా నాయకుడు అనరాసి నాగరాజు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా బత్తుల సతీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా ఇల్లందు రమేష్, ఇట్టబోయిన కుమారస్వామి ఎంపికయ్యారు.

నూతన కమిటీ వివరాలు

మండల అధ్యక్షుడు: బత్తుల సతీష్. గౌరవ అధ్యక్షులు: ఇల్లందు రమేష్, ఇట్టబోయిన కుమారస్వామి. ఉపాధ్యక్షులు: వల్లపు రాజు, బండి శ్రీను, జరుపుల సంధ్య, గుడిపల్లి సాయి. ప్రధాన కార్యదర్శులు: చుంచు అనిల్ కుమార్, ఏడబోయిన స్రవంతి. కార్యదర్శులు: మంద మహేందర్, లింగాల ఎలేంద్ర, ఏలేటి రాజిరెడ్డి, వొడితం రమేష్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు బత్తుల సతీష్ మాట్లాడుతూ మండలంలోని వార్డు మెంబర్లకు ఎలాంటి సమస్య ఎదురైనా ముందుండి పరిష్కారం కోసం పోరాడుతానని తెలిపారు. వార్డు మెంబర్ల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డు మెంబర్ల ఐక్యతను బలోపేతం చేస్తూ, వారి గొంతుకగా ఫోరం పనిచేసేలా



కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడు ముక్క అనిల్, జిల్లా నాయకుడు అనరాసి నాగరాజుతో పాటు మండల వార్డు మెంబర్లు మునిరాజు, కీర్తి రమేష్ తదితర గ్రామాల వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే దుబ్బాక ప్రజలకు నిజమైన దీపావళి

- కొత్త ప్రభాకర్ రెడ్డికి కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సవాల్
- ఐకేపీ కొనుగోలు కేంద్రాల ప్రారంభం.. బీఆర్ఎస్ పాలనపై విమర్శలు..



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 12, :

మాటలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం కాకుండా దుబ్బాక అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని, అలా చేస్తేనే దుబ్బాక ప్రజలకు నిజమైన దీపావళి అవుతుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఎమ్మెల్యే ఇటీవల చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చెరుకు శ్రీనివాస్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. ఆయన వ్యాఖ్యలు వింటుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కావడం లేదని విమర్శించారు. పోతారం గ్రామంలో కాల్వల డిజైన్ మార్పు కారణంగా రైతులకు అన్యాయం జరిగిందని, తమ హక్కుల కోసం రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతుల హక్కులకు భంగం కలిగిందని ఆరోపించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం 18 నెలల పాటు నిలిచిపోవడానికి అప్పటి పాలకుల అసమర్థతే కారణమని విమర్శిస్తూ, చెరుకు ముత్యం రెడ్డి చొరవతోనే ప్రాజెక్టు పూర్తయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దుబ్బాక ప్రాంతానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయించామని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా ప్రజలకు అందిస్తున్నామని వివరించారు. దుబ్బాక అభివృద్ధి, రైతుల సంక్షేమం విషయంలో రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ప్రజలకు చేసిన పనులపై చర్చకు రావాలని పరోక్షంగా ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే పదవికి కొత్త ప్రభాకర్ రెడ్డి రాజీనామా చేస్తే దుబ్బాక ప్రజలకు నిజమైన దీపావళి అవుతుందని చెరుకు శ్రీనివాస్ రెడ్డి పునరుద్ఘాటించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి
- వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాక ప్రతినిధి (అక్బర్‌పేట భూంపల్లి), నవంబర్ 12, :

అక్బర్‌పేట భూంపల్లి మండలంలో నగరం, భూంపల్లి, బేగంపేట గ్రామాలలో రైతుల సౌకర్యార్థం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రంలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, అక్బర్‌పేట భూంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుండా శంకర్, పాక్స్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మెర సంయుక్త శ్రీధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామి గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏలూరి కమలాకర్, ఎల్లన్నగారి సురేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మారెడ్డి, తిప్పన బోయిన పున్నవ్వ, మండల ప్రధాన కార్యదర్శి పాతూరి ప్రదీప్ రెడ్డి, నగరం



ఉపసర్పంచ్ జీడిపల్లి రమేష్, బేగంపేట గ్రామ సర్పంచ్ అన్నబోయిన చంద్రశేఖర్, మాజీ ఎంపిటిసి పాతురి శ్రీనివాస్ గౌడ్, వేల్పుల యాదయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

చెట్టబోయిన యాదగిరి మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటు

- కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడు
- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమన్న
- సిద్దిపేటలో కార్మిక సంఘ నేత యాదగిరికి ఘనంగా సంతాప సభ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, : కార్మికుల హక్కుల సాధన కోసం జీవితాంతం కృషి చేసిన చెట్టబోయిన యాదగిరి మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమన్న అన్నారు. సిద్దిపేట రైస్ అండ్ పారాబాయిల్డ్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన యాదగిరి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని హనుమాన్ నగర్‌లో చెట్టబోయిన యాదగిరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన్న మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులను ఏకతాటిపైకి తీసుకొచ్చి, వారికి సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో యాదగిరి చివరి శ్వాస వరకు పనిచేశారని గుర్తుచేశారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా సిద్దిపేటలో ఐఎఫ్‌టీయూ అనుబంధంగా కార్మిక ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ, తనదైన ముద్ర వేశారని తెలిపారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లులు, పారాబాయిల్డ్ మిల్లుల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులను సంఘటితం చేయడమే కాకుండా, వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి కార్మిక సంఘ నాయకులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ చురుకైన పాత్ర పోషిస్తూ కార్మికులను ఉద్యమంలో భాగస్వాములను చేశారని గుర్తుచేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఆత్మగౌరవం కోసం నిరంతరం తపించిన యాదగిరి లేని లోటు



పూడ్చలేనిదని భూమన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం, కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడటం ప్రతి కార్మికుడి బాధ్యత అని పిలుపునిచ్చారు. అనంతరం యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సంతాప సభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ సిద్దిపేట కార్యదర్శి ఎస్వి శ్రీకాంత్, హమాలీ సంఘం బాధ్యులు మల్లికార్జున్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు దేవులపల్లి రమేష్, సిద్దిపేట రైస్ అండ్ పారాబాయిల్డ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం, కోశాధికారి జయరాజ్, సంఘ నాయకులు వెంకటేష్, మల్లికార్జున్, మింటు, రాజు, కనకయ్య, దుర్గయ్య, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్, వివిధ సంఘాల నాయకులు మూర్తి, శ్రీనివాస్ రెడ్డి, శివరాజ్ తదితరులు పాల్గొని యాదగిరికి ఘనంగా నివాళులర్పించారు.

బహుజనుల హక్కుల కోసం ఉద్యమించాలి

దుబ్బాక మండల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకుల పిలుపు



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 12, :
ఈనెల 20 న జరిగే దుబ్బాక మండల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల బహుజన నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో హక్కుల సాధన కోసం, అదేవిధంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు తమ హక్కుల కొరకై తమ ఆత్మగౌరవ సామాజిక మనత్వ న్యాయం కోసం ఉద్యమించ వలసిన అవసరము ఎంతో ఉన్నదని తెలిపారు. కావున దుబ్బాక మండల పరిధిలోని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ప్రజలందరూ పార్టీలకతీతంగా ఈనెల 20 న వైశ్య భవన్ దుబ్బాకలో జరిగే సమావేశాన్ని విజయవంతం చేసి మన హక్కుల సాధనలో ముందుండాలని పిలుపునిచ్చారు.

రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యత

- రాంపూర్, కాన్గల్, లింగంపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఏఎంసీ, పాక్స్ చైర్మన్లు విజయ్ రెడ్డి, హరికృష్ణరెడ్డి

దుబ్బాక ప్రతినిధి, (తొగుట), నవంబర్ 12, :
తొగుట మండలంలోని రాంపూర్, కాన్గల్, లింగంపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణ రెడ్డితో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర



పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని, రైతులకు అండగా నిలుస్తూ వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండేలా చూసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, సర్పంచ్ల రవీందర్, గొడుగు జయమ్మ నర్సింలు, మండల పార్టీ అధ్యక్షులు పంది రాజు, ఉపాధ్యక్షులు మజ్జిగ వెంకట్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ మహిపాల్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ అన్సర్, గ్రామ పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, కృష్ణ, నాయకులు వెంకటేశం, కొండల్ రెడ్డి, బషీర్, పాక్స్ సీఈఓ గంగారెడ్డి, సిబ్బంది శేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బ్యాంకు సహకారంపై అవగాహన

దుబ్బాక టౌన్, నవంబర్ 12, :



దుబ్బాక మున్సిపాలిటీలోని 12వ వార్డులో గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ పాడి రైతులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో తమ బ్యాంకు సహకారం అందిస్తుందని తెలిపారు. బ్యాంకులో అకౌంట్ ఉన్న ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ పాలసీ తప్పకుండా చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ బండి శ్రీలేఖ రాజు, బ్యాంకు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

- దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 12, :
దుబ్బాక మండల పరిధిలోని ఆకారం, రఘోత్తంపల్లి, రామక్క పేట, మల్లాయపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలనుఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు, సురక్షితమైన తాగునీరు, నాణ్యమైన రహదారులు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం గ్రామాల అభివృద్ధి ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని చెరుకు శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక అధ్యక్షులు కడుదురి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, పాక్స్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు మల్లు గారి రామచంద్ర రెడ్డి, ఉపాధ్యక్షులు కొండే గోపాల్



రెడ్డి, డైరెక్టర్లు, ఆకుల భరత్, సంజీవులు, పర్స నర్సింలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, నాయకులు అయిరేని సాయి తేజ గౌడ్, మహమ్మద్ నజీర్, ఎన్ఎస్యుఐ నాయకులు సంగేపు తేజ, కిసరి శ్రీనివాస్, భూపతి, కోమటిరెడ్డి పద్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలి •లబ్ధిదారులకు సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి సూచన

సదాశివపేట, నవంబర్ 12, :




సదాశివపేట మండలం వెంకటాపురం గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వెంటనే ప్రారంభించాలని సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులతో మాట్లాడి, ఇళ్ల నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సదాశివపేట మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు.

జగద్గిరిగుట్టలో 17వ వార్షిక సదర్ సమ్మేళనం..

ఎంపీ ఈటల రాజేందర్ కు ఆహ్వానం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 12, : జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వద్ద నిర్వహించనున్న 17వ వార్షిక సదర్ సమ్మేళన మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయవలసిందిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను సదర్ కమిటీ సభ్యులు ఘనంగా ఆహ్వానించారు. సదర్ కమిటీ చైర్మన్, అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కే. శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీ



ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, సమ్మేళనానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరితో పాటు సదర్ కమిటీ సభ్యులు ఆర్థిక్ యాదవ్, సింహం యాదవ్, గండి రాజు యాదవ్, ఆంజనేయులు యాదవ్, నాగరాజు యాదవ్, గొల్ల పాండు యాదవ్, కుర్మయ్య యాదవ్, పండరి యాదవ్, మోటే కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బొంగునూరి కిషోర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కొలన్ హన్మంత్ రెడ్డి

నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు అందజేత



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 12, : తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు, నూతన గృహప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కార్యక్రమానికి హాజరై బొంగునూరి కిషోర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన గృహప్రవేశం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు అందజేస్తూ, నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సొంటిరెడ్డి పున్నారెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు, డీసీసీ కమిటీ సభ్యులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొని బొంగునూరి కిషోర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

రెండోసారి తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా గంగుల అంజలి యాదవ్ బాధ్యతల స్వీకరణ

- నాపై నమ్మకం ఉంచి మరోసారి అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు – గంగుల అంజలి యాదవ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 12, : తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా గంగుల అంజలి యాదవ్ రెండోసారి బాధ్యతలు స్వీకరించారు. గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని గాంధీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అఖిల భారత మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అలకా లాంబా, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రవల్లి స్వర్ణ, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కమలాక్షి నటరాజన్‌ల సమక్షంలో ఆమె ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గంగుల అంజలి యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మరోసారి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను కేవలం పదవిగా కాకుండా మహిళల హక్కుల పరిరక్షణకు, వారి అభ్యున్నతికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా మరింత అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు



నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు రెండోసారి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని గంగుల అంజలి యాదవ్ తెలిపారు.

108 ఏళ్ల ప్రజా విశ్వాసం.. ఆర్థిక ప్రగతికి యూనియన్ బ్యాంక్ బాసట..

ఘనంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

- సైబర్ మోసాలపై అప్రమత్తతే శ్రీరామరక్ష.. డీఎస్పీ పాల రాజు..
- క్రమశిక్షణ, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలు.. మోటివేషనల్ స్పీకర్ ప్రదీప్..





సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, :

ప్రజల నమ్మకమే పునాదిగా.. సేవల విస్తరణే లక్ష్యంగా.. దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వామిగా 108 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో మైలురాయిని ఘనంగా జరుపుకుంది. బ్యాంకింగ్ సేవలతో ప్రజల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపుతూ, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు సేవలను విస్తరిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 108వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సిద్దిపేటలో అంగరంగ వైభవంగా జరిగాయి. సిద్దిపేట పట్టణంలోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి. బ్యాంకు సాధించిన విజయాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, భవిష్యత్తు లక్ష్యాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమం ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఖాతాదారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సిద్దిపేట సైబర్ క్రైమ్ డీఎస్పీ పాల రాజు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి. రమేష్, ప్రముఖ నటుడు, ప్రేరణాత్మక వక్త ప్రదీప్ హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధికి బాటలు

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో బ్యాంకింగ్ రంగం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు పొదుపు అలవాటును పెంపొందించడంతో పాటు, రైతులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు, గ్రామీణ ప్రజలకు ఆర్థిక సేవలను చేరువ చేయడంలో బ్యాంకులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆర్థిక లావాదేవీలను మరింత సులభతరం చేస్తున్నాయని కొనియాడారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు.. డీఎస్పీ పాల రాజు

ప్రస్తుత సాంకేతిక యుగంలో బ్యాంకింగ్ సేవలు ఎంత సులభతరమయ్యాయో, అదే స్థాయిలో సైబర్ నేరాల ముప్పు కూడా పెరుగుతోందని సైబర్ క్రైమ్ డీఎస్పీ పాల రాజు హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, డిజిటల్ బ్యాంకింగ్ మోసాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకూడదని, ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించకూడదని స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసే అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి వ్యక్తిగత వివరాలు ఇవ్వవద్దని సూచించారు. అనుకోకుండా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ప్రేరణతో నిండిన ప్రసంగం.. ఉద్యోగుల్లో నూతనోత్సాహం..

ప్రముఖ నటుడు, మోటివేషనల్ స్పీకర్ ప్రదీప్ తనదైన శైలిలో చేసిన ప్రేరణాత్మక ప్రసంగం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. జీవితంలో విజయం సాధించాలంటే కేవలం కలలు కనడం సరిపోదని, వాటిని నిజం చేసుకునే దిశగా నిరంతర కృషి, క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల అవసరమని వివరించారు. ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలుచుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయన మాటలు బ్యాంకు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో ఉత్సాహాన్ని నింపాయి.

ప్రజల విశ్వాసమే బలం.. మెరుగైన సేవలే లక్ష్యం..

108 ఏళ్ల చరిత్ర కలిగిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్థానం కేవలం ఒక బ్యాంకు విజయగాథ మాత్రమే కాదని, ప్రజల ఆర్థిక అవసరాలకు అండగా నిలుస్తూ విశ్వాసాన్ని సంపాదించిన సేవా ప్రయాణమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో బ్యాంకు అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, ఖాతాదారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. 108 ఏళ్ల ఘనమైన ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని, ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలనే సందేశంతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా ముగిశాయి.

రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇవ్వాలి

- క్వింటాలుకు రూ.300 కమిషన్ చెల్లించాలి
- ఎన్నికల హామీలను అమలు చేయాలి
- రూ.600 కోట్ల విలువైన పాత బియ్యం పురుగులు, ఎలుకలపాలు
- డీలర్లపై తరుగుభారం మోపడం అన్యాయం
- ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వినతి.
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హామీ

సదాశివపేట, నవంబర్, 12:

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ తక్షణమే చెల్లించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ చెల్లించడంతో పాటు రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా మారుస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లయినా హామీలను అమలు చేయకుండా రాష్ట్రంలోని 17,200 మంది డీలర్లను ప్రభుత్వం విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు.




చేర్యాల లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

- ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 12, :

చేర్యాలలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన హోమ కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, సమాజంలో సుఖశాంతులు వెల్లివిరియాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మీ నారాయణ గౌడ్, కాంగ్రెస్ యువ నాయకులు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఆట స్థలాన్ని కాపాడేందుకు కొలన్ హన్మంత్ రెడ్డి కృషి

- ప్రగతి నగర్ ప్రభుత్వ పాఠశాల ఆట స్థల పరిరక్షణకు ప్రత్యేక చొరవ
- మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేయనున్న కాంగ్రెస్ హన్మంత్ రెడ్డి


కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 12, : ప్రగతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆట స్థలాన్ని పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఆట స్థల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పాఠశాల ఉపాధ్యాయులు, ప్రగతి నగర్ మరియు బండారి లేఔట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమస్య తీవ్రత, పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రగతి నగర్ ప్రభుత్వ పాఠశాల ఆట స్థల పరిరక్షణ కోసం ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. అంతేకాకుండా అనేక పర్యాయాలు మీడియా సమావేశాలు నిర్వహించి, ఆట స్థలాన్ని కాపాడాల్సిన ఆవశ్యకతను ప్రజలకు, ప్రభుత్వానికి వివరించామని పేర్కొన్నారు. విద్యార్థుల క్రీడా హక్కులను కాపాడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును స్వయంగా కలిసి వినతిపత్రం అందజేయడంతో పాటు, ఆట స్థలాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకతను వివరించి, తక్షణ చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ఆట స్థలం విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎంతో అవసరమని, దానిని కాపాడుకోవడం భవిష్యత్ తరాల ప్రయోజనాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్మ వెంకటేశ్వర రెడ్డి, బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వరగాని వాసు, డీసీసీ కమిటీ సభ్యులు మౌళీశ్వర్ రావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గాంధీనగర్ అభివృద్ధిలో జల్దా రాఘవులు సేవలు మరువలేనివి

- ఆయన ఆశయ సాధనకు కాలనీవాసులంతా ఐక్యంగా కృషి చేయాలి – ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 12, అఖండదీపం, : గాంధీనగర్ కాలనీ అభివృద్ధికి విశేష కృషి చేసిన వ్యవస్థాపకులు కీ.శే. జల్దా రాఘవులు సేవలు మరువలేనివని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాంధీనగర్ వ్యవస్థాపకులు జల్దా రాఘవులు 81వ జయంతిని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



ఈ సందర్భంగా జల్దా రాఘవులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మున్సిపల్ ఉద్యోగులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గాంధీనగర్ అభివృద్ధికి జల్దా రాఘవులు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కాలనీవాసులంతా ఐకమత్యంతో ఏకతాటిపై నిలిచి, గాంధీనగర్ మరింత అభివృద్ధి చెందేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్, డివిజన్ అధ్యక్షుడు ఎర శంకరయ్య, కాలనీవాసులు ఎల్లయ్య, అబ్దుల్ ఖాదర్, శ్రీనివాస్, సత్యనారాయణ, పద్మ, మల్లీశ్వరి, తిమ్మయ్య, విజయ్, నవీన్‌తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

17వ వార్షిక సదర్ సమ్మేళన మహోత్సవానికి ఘనంగా ఆహ్వానం

- ముఖ్య అతిథిగా హాజరుకావాలని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌కు ఆహ్వానం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 12, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వద్ద నిర్వహించనున్న 17వ వార్షిక సదర్ సమ్మేళన మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయవలసిందిగా మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్ యాదవ్‌ను సదర్ కమిటీ తరఫున గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. సదర్ కమిటీ చైర్మన్, అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కే. శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, సదర్ కమిటీ సభ్యులు ఆర్థిక్ యాదవ్, సింహ యాదవ్, గండి రాజు యాదవ్, ఆంజనేయులు యాదవ్, నాగరాజు యాదవ్, గొల్ల పాండు యాదవ్, కుర్మయ్య యాదవ్, పండరి యాదవ్, మోటే కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మిడికుంట చెరువు అభివృద్ధికి శ్రీకారం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన బండి రమేష్

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబరు 12, :

తుమ్మిడికుంట చెరువు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఘన స్వాగతం పలికారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో చెరువు అభివృద్ధికి సంబంధించిన ఫొటో ప్రదర్శనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిలకించి, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామంతాపూర్ పెద్ద చెరువు వద్ద గుడిసెలు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ తుమ్మిడికుంట చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం కావడం ఎంతో సంతోషకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పరిరక్షణతో పాటు వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చెరువుల పునరుద్ధరణ వల్ల పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చెరువులను సంరక్షించడం, అభివృద్ధి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విప్ మహేందర్ రెడ్డి, సినీ నటుడు నాగార్జున, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, సిఎంసి కమిషనర్ సృజన, లింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో కోవర్టు రాజకీయాలు చేస్తున్న అనిల్ రెడ్డి

- పార్టీ పెద్దలతో ఫొటోలు దిగుతూ స్థానిక నాయకులను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ నేతల ఆరోపణ
- చిల్లర రాజకీయాలు మానుకోకుంటే తగిన బుద్ధి చెబుతాం
- ఆధారాలతో పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తాం

గజ్వేల్ ప్రతినిధి (వర్గల్), నవంబర్ 12, :
వర్గల్ మండల కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. మల్లారెడ్డిపల్లికి చెందిన అనిల్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా కోవర్టు రాజకీయాలు చేస్తూ, స్థానిక నాయకులపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ పెద్దలతో దిగిన ఫొటోలను చూపిస్తూ కార్యకర్తలను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వర్గల్ శివారులోని టీజీఆర్ గార్డెన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి డాక్టర్ యాదగిరి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంజాల సాయిగౌడ్, సీనియర్ నాయకులు అంజిరెడ్డి, మల్లారెడ్డి, పిట్ల రాజు, మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అనిల్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉందని విమర్శించారు. గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని అంకితభావంతో పనిచేస్తున్న తాము, పార్టీ కష్టకాలంలోనూ కార్యకర్తలకు అండగా నిలిచామని పేర్కొన్నారు. వివిధ పార్టీల్లో తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన అనిల్ రెడ్డి, పార్టీ అగ్రనేతలతో దిగిన ఫొటోలను అడ్డుపెట్టుకుని స్థానికంగా తనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ నేతలతో కలిసి తిరుగుతూ కాంగ్రెస్ నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మల్లారెడ్డిపల్లిలో జరిగిన ఫ్లెక్సీల దహనం ఘటనతో తమకు ఎలాంటి సంబంధం



లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో తమ నిజాయితీని నిరూపించు కునేందుకు గ్రామంలోని చౌరస్తాలో ఉన్న ఆలయం వద్ద ప్రమాణం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అనిల్ రెడ్డి కూడా అందుకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. వర్గల్ మండల కాంగ్రెస్‌లో అనిల్ రెడ్డికి ఎలాంటి ప్రత్యేక వర్గం లేదా గ్రూపు లేదని, ఆయన ఒంటరిగానే రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పార్టీని తులసి మొక్కలా కాపాడుకుంటుంటే, అనిల్ రెడ్డి మాత్రం గంజాయి మొక్కలా మారి పార్టీకి నష్టం కలిగిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు, చిల్లర రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. అనిల్ రెడ్డి ఎవరెవరితో కలిసి రాజకీయాలు చేస్తున్నారు, ఏయే పార్టీల నేతలతో సంబంధాలు కొనసాగిస్తున్నారు అనే అంశాలపై తమ వద్ద ఉన్న ఆధారాలను పార్టీ పెద్దల ముందు ఉంచి అధికారికంగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాలేష్, శ్రీకాంత్, శ్రీహరి, వెంకటేష్, స్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శంభీపూర్ లో అయ్యప్ప మహా పడిపూజ..

- కేటీఆర్, హరీష్ రావుకు ఆహ్వానం పలికిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 12, :
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శంభీపూర్‌లో ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి హాజరుకావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావులను ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్‌లతో కలిసి కేటీఆర్, హరీష్ రావులను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆహ్వాన పత్రిక అందజేశారు. శంభీపూర్‌లోని తన నివాసంలో నవంబర్ 19న భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఈ సందర్భంగా వారిని కోరారు. మహా పడిపూజ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వారికి తెలియజేసి, ఆహ్వానం పలికారు.





కేపీహెచ్‌బీ వాసుల 40 ఏళ్ల చిరకాల కోరిక నెరవేర్చిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- ప్రభుత్వ పాఠశాల కోసం 2.39 ఎకరాల భూమి విద్యాశాఖకు బదిలీ
- ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన బీఆర్ఎస్ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 12, :
రమ్యా గ్రౌండ్స్ వద్ద ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం కేటాయించిన 2.39 ఎకరాల భూమిని మెదక్ జిల్లా కలెక్టర్ మనో చౌదరి విద్యాశాఖకు బదిలీ చేయడం పట్ల కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా హర్షం వ్యక్తం చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ వాసుల 40 ఏళ్ల చిరకాల కోరికను నెరవేర్చేందుకు కృషి చేసిన హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం రెడ్డి సతీష్ అరోరా మాట్లాడుతూ.. దాదాపు నాలుగు సంవత్సరాల క్రితమే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి పునాదులు వేసి పనులు ప్రారంభించారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హౌసింగ్ బోర్డు



స్థలాల పేరుతో ఈ భూమిని విక్రయించేందుకు బోర్డులు ఏర్పాటు చేసి వేలం వేసే ప్రయత్నం చేసిందన్నారు.పాఠశాల నిర్మాణానికి ఉద్దేశించిన ఈ విలువైన స్థలాన్ని కాపాడేందుకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎన్నో పోరాటాలు చేశారని, ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారని గుర్తుచేశారు. ఆయన నిరంతర కృషి ఫలితంగానే నేడు స్థలం విద్యాశాఖకు బదిలీ అయిందని పేర్కొన్నారు.ఈ విజయంలో కేపీహెచ్‌బీ కాలనీ ప్రజలు, స్థానిక నాయకులు, మీడియా మిత్రుల సహకారం మరువలేనిదని అన్నారు. ముఖ్యంగా మీడియా మిత్రులు ఈ సమస్యను ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రజా ఉద్యమానికి మద్దతుగా నిలిచారని, వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.స్థలం విద్యాశాఖకు బదిలీ కావడంతో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి మార్గం సుగమమైందని, ప్రభుత్వం వెంటనే నిర్మాణ పనులు చేపట్టి స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.అదేవిధంగా కూకట్‌పల్లి, మూసాపేట ప్రాంతాల్లో మిగిలి ఉన్న ప్రభుత్వ భూములను విక్రయించకుండా ప్రజా అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విలువైన ప్రభుత్వ భూములను విక్రయిస్తే భవిష్యత్తు తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ ప్రజలకు, స్థానిక నాయకులకు, మీడియా మిత్రులకు, జిల్లా కలెక్టర్ మనో చౌదరికి, ముఖ్యంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దశలవారీగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన – మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 12, :
జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్థానిక మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. ఈ క్రమంలో గురువారం శ్రీనివాస్ నగర్ స్మశానవాటికలో రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు పనులను స్థానికులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలుకుల జగన్ మాట్లాడుతూ.. ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మశానవాటికలో నూతన బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా స్థానికుల సహకారంతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డివిజన్‌లో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మొహమ్మద్ ఆజామ్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

చకుముఖి టాలెంట్ టెస్టులో శ్రీవాణి విద్యార్థుల ప్రతిభా పతాకం

- మండల స్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక
- అభినందించిన పాఠశాల యాజమాన్యం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, :
విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ వారిలో సృజనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన చకుముఖి టాలెంట్ టెస్టులో సిద్దిపేట శ్రీవాణి పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాల కీర్తిని చాటారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఈ ప్రతిభా పరీక్షలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ విజ్ఞానం, ఆలోచనా నైపుణ్యాలు, మేధో సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థిని పి దీక్షిత, తొమ్మిదో తరగతి విద్యార్థి కె అభినవ్, ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం సహస్ర మండల స్థాయి చకుముఖి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21న నిర్వహించనున్న మండల స్థాయి పోటీల్లో వీరు పాఠశాల తరపున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ సత్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో పుస్తక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మకత, తార్కిక ఆలోచన, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించ డానికి ఇలాంటి ప్రతిభా పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించినప్పుడే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించ గలరని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు వివిధ పోటీల్లో పాల్గొంటూ తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. మండల స్థాయి పోటీలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులను పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే



పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో పాల్గొని మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల విజయంతో పాఠశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలి: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

- దుండిగల్ తండా–1 ప్రభుత్వ పాఠశాలలో నూతన వంటశాల ప్రారంభం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 12, :
సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ తండా–1 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటశాలను గురువారం బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, రుచికరమైన భోజనం అందించడం ఎంతో ముఖ్యమని అన్నారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా వంటశాల, భోజనశాలలను నిర్మించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించిన మోల్డ్ టెక్ కంపెనీ యాజమాన్యానికి, ఇందుకు సహకరించిన పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణకు అనుగుణంగా రానున్న రోజుల్లో ఈ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మరింత అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమ్ సింగ్, ప్రవీణ్ గడిల, నాయకులు, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, గోపాల్ రెడ్డి, జగన్ నాయక్, మహేందర్ నాయక్, కొల్తూరి మల్లేష్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, విద్యార్థి విభాగం నాయకులు ప్రవీణ్ నాయక్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి కాంగ్రెస్‌లో ఐక్యతా స్వరం

పార్టీ బలోపేతానికి సీనియర్ నేతల సమష్టి కార్యాచరణ

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 12, :
కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ జేఏసీ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు గురువారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. పార్టీ శ్రేణులందరినీ సమన్వయం చేసుకుంటూ ఐక్యతతో ముందుకు సాగాలని ఈ సమావేశంలో నాయకులు నిర్ణయించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అట్టడుగు వర్గాలకు చేరేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం, కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని నాయకులు సంకల్పించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ, నాయకులు, కార్యకర్తల



మధ్య సమన్వయాన్ని మరింత పెంపొందించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన సంజీవరావు, సీనియర్ నాయకులు సీహెచ్ కొండల్ రెడ్డి, కార్పొరేటర్‌గా పోటీ చేసిన విట్టల్ రెడ్డి, అబ్దుల్ బాకీ, మాజీ డివిజన్ అధ్యక్షులు తమ్మినేని



ప్రవీణ్ కుమార్, కృష్ణ రాజ్‌పుత్, రాజశేఖర్ రెడ్డి, సుంకన్న, గోవింద్ గౌడ్, ఎస్సీ సెల్ రాము, మైనారిటీ సెల్ చోటా మొయిజ్, షేక్, నాగేశ్వరరావు, నరేష్, వెంకటేష్ యాదవ్, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో ఘనంగా సదర్ మహోత్సవం

- పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు



కూకట్‌పల్లి ప్రతినిధి నవంబర్ 12 :

యాదవ సంఘం మరియు గండి ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సోదరులతో కలిసి సదర్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. యాదవుల ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయాలకు సదర్ మహోత్సవం ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. వేడుకలను ఘనంగా నిర్వహించిన కూకట్‌పల్లి యాదవ సంఘం నాయకులకు, గండి ఫ్యామిలీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలిగా శోభారాజన్ నియామకం

వడ్డేపల్లి రాజేశ్వరరావు చేతుల మీదుగా శాలువాతో సత్కారం



కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్12, :

మోతీనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకురాలు శోభారాజన్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం శోభరాజన్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు శోభారాజన్‌ను అభినందించి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళా మోర్చా ద్వారా పార్టీ బలోపేతానికి, మహిళల సమస్యల పరిష్కారానికి మరింత చురుకుగా కృషి చేస్తూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు విజయ భవాని, మోతీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎర్ర స్వామి, డివిజన్ నాయకులు రమేష్ నాయర్, ఎలేందర్ రెడ్డి, వాసవి, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల వేలంపై సమర శంఖం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో భారీ నిరసన



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబరు 12, :

కూకట్‌పల్లి హెచ్ఎండీఏ పరిధిలోని ప్రభుత్వ భూములను వేలం వేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ, వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రేపు శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షులు, కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొట్టు విష్ణు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటిని వేలం వేసి ఆదాయం సమకూర్చుకోవడం కాకుండా స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు , ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీలు శంభుపూర్ రాజు , నవీన్ రావు హాజరుకానున్నారు.కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని అన్ని కుల, సామాజిక వర్గాల ప్రజలు, కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు, యువత, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొట్టు విష్ణు విజ్ఞప్తి చేశారు.

పోలీసుల చొరవతో ప్రభుత్వ పాఠశాలకు కొత్త కళ

- 'మన పోలీస్-మన ఊరు' కార్యక్రమంతో హబ్సిపూర్ పాఠశాల సుందరీకరణ
- విద్యార్థులకు భోజన ప్లేట్లు, రీసైకిల్డ్ పెన్సిళ్ల పంపిణీ.. డయల్ 112పై అవగాహన..



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 12, :

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి పోలీసు శాఖ తన వంతు సామాజిక బాధ్యతను చాటుకుంది. 'మన పోలీస్–మన ఊరు' కార్యక్రమంలో భాగంగా దుబ్బాక పోలీసులు హబ్సీపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణను సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు. ఇటీవల దుబ్బాక పర్యటనకు వచ్చిన పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ పాఠశాలను సందర్శించిన సమయంలో అక్కడి పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆహ్వానించే వాతావరణం కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సీపీ ఆదేశాల మేరకు దుబ్బాక పోలీసులు ప్రత్యేక చొరవ చూపారు. పాఠశాల ప్రవేశ ద్వారంలోని సూచిక బోర్డుతో పాటు ప్రహరీ గోడలకు కొత్త రంగులు వేయించి పాఠశాల రూపురేఖలను మార్చారు. దీంతో పాఠశాల ఆవరణ కొత్త అందాలను సంతరించుకుని ఆకర్షణీయంగా మారింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలను సందర్శించిన సీపీ సాధన రష్మీ పెరుమాళ్ విద్యార్థులకు భోజన ప్లేట్లు, పునర్వినియోగ ప్లాస్టిక్‌తో తయారుచేసిన పెన్సిళ్లను పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ పోలీసు సహాయం పొందేందుకు ఉపయోగపడే డయల్ 112 సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజల భద్రతతో పాటు సమాజ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం పోలీసులు చేపడుతున్న ఇలాంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక సీఐ రాజేష్, ఎస్సై కీర్తి రాజు, మిరుదొడ్డి ఎస్సై సతీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కవిత పర్యటనకు నియోజకవర్గ ప్రజలకు కుంకుమార్చనతో ప్రత్యేక ఆహ్వానం





- తెలంగాణ రక్షణ సేన కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ.. ఘన స్వాగతానికి ఏర్పాట్లు..

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, :

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత శుక్రవారం సిద్దిపేటలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రంగధాంపల్లి చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్తూపం సమీపంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి ఉదయం 10 గంటలకు భూమిపూజ నిర్వహించనున్నారు. హైదరాబాద్, నిజామాబాద్ తర్వాత సిద్దిపేటలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. కవిత పర్యటన సందర్భంగా ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

కవితమ్మ భూమిపూజ కార్యక్రమానికి కుంకుమార్చనతో ప్రజలకు ఆహ్వానం

కవితమ్మ సిద్దిపేట పర్యటన సందర్భంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయ నిర్మాణానికి నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి సతీమణి చల్లారం నవిత అలియాస్ కవిత మల్లారెడ్డి స్వయంగా ప్రజల ఇళ్లకు వెళ్లి మహిళలకు కుంకుమ బొట్టు పెట్టి మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు. సంప్రదాయబద్ధంగా ఆహ్వానిస్తూ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లం రమేష్, కమలాకర్, నగేష్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవిత పర్యటన ఇలా..


శుక్రవారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ నివాసం నుంచి బయలుదేరి 9 గంటలకు సిద్దిపేటకు చేరుకోనున్నారు. తొలుత శ్రీఉమా పార్థివ కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఇక్బాల్ మినార్ సమీపంలోని జానుల్లా షా దర్గాలో చాదర్ సమర్పిస్తారు. ఆ తర్వాత ఆర్డీఓ కార్యాలయం సమీపంలోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు రంగధాంపల్లి చౌరస్తాలో తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపన చేస్తారు. ఉదయం 11 గంటలకు నిర్మాణ స్థలంలో మీడియాతో మాట్లాడనున్నారు. కవిత పర్యటన నేపథ్యంలో సిద్దిపేటలో రాజకీయ వర్గాలతో పాటు పార్టీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

చెరువుల అభివృద్ధికి రూ.6 కోట్ల నిధులు మంజూరు

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణి చేసిన ఎమ్మెల్యే

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 12, :

జగిత్యాల పట్టణానికి చెందిన 57 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన 57 లక్షల విలువగల చెక్కులను జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు, మోతె చెరువు అభివృద్ధికి ప్రభుత్వం ఒక్కో చెరువుకు రూ.3 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఏడాది క్రితమే నిధులు మంజూరైనప్పటికీ వర్షాలు, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పనుల ప్రారంభంలో కొంత జాప్యం జరిగిందని వివరించారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి, పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజలందరికీ ఈ విషయం తెలుసునని అన్నారు. కొందరు నాయకులు కావాలనే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చెరువుల పునరుజ్జీవన పనులు ప్రారంభం కానున్నాయని తెలిసి, పనులు ఇంకా ప్రారంభించలేదంటూ విమర్శలు చేయడం, తాము ప్రశ్నించడం వల్లే పనులు జరుగుతున్నాయని భావించడం వారి అపోహ మాత్రమేనని పేర్కొన్నారు. చెరువుల పునరుజ్జీవన పథకంలో 67 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 33 శాతం కేంద్ర ప్రభుత్వం వాటా ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రూపంలో 18 శాతం వసూలు చేస్తోందని అన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి నూతన పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని, అర్హులైన ప్రభుత్వం ముందుకు సాగుతోందని



ప్రతి ఒక్కరికీ దశలవారీగా పెన్షన్లు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మహిళల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు అవసరమైన నూతన పథకాలను కూడా ప్రజాప్రభుత్వం అందిస్తోందని, మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతే లక్ష్యంగా జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, తహసీల్దార్ రామ్మోహన్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, అడువాల లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ దుమాల రాజ్ కుమార్, జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్ , డీసీసీ ఉపాధ్యక్షులు రవీందర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో మహిళా క్రికెట్‌కు రాష్ట్రస్థాయి వేదిక

- జాతీయ, రాష్ట్రస్థాయి మ్యాచ్‌లు నిర్వహించే స్థాయికి స్టేడియం అభివృద్ధి
- ఎమ్మెల్యే హరీశ్‌రావు
- అండర్-19 మహిళా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించిన మాజీ మంత్రి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, :

సిద్దిపేట క్రికెట్ స్టేడియంను జాతీయ, రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించే స్థాయికి అభివృద్ధి చేసుకున్నామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్–19 తెలంగాణ రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గతంలో సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో ఎన్నో రాష్ట్రస్థాయి, రంజీ స్థాయి క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీలకు సిద్దిపేట స్టేడియం



వేదిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రీడల్లో పురుషులతో సమానంగా మహిళా క్రీడాకారులు కూడా పోటీపడి తమ ప్రతిభను నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట నుంచి ఇప్పటికే ఎంతోమంది క్రీడాకారులు రంజీ జట్టుకు ఎంపికై ప్రతిభ చాటారని తెలిపారు. స్థానికంగా క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించామని పేర్కొన్నారు. మహిళా క్రీడాకారులు ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, భవిష్యత్తులో రంజీ జట్టుకు ఎంపికై ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సిద్దిపేట క్రీడారంగం మరింత అభివృద్ధి చెందాలని, ఇక్కడి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని హరీశ్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు.



వేరుశనగ తింటే.. ఉక్కులా మారడం ఖాయం

వేరుశెనగను చాలా మంది ఇష్టపడతారు. వీటిని అనేక రకాలుగా ఆహారంలో చేర్చుకుంటారు. వర్షా కాలం వచ్చిందంటే చాలా మంది పచ్చి శనగలను కొని వేయించి లేదా ఉడకబెట్టి తింటారు. ఇది రుచికరమైన చిరుతిండి మాత్రమే కాదు ఇందులో ఎన్నో రకాల పోషకాలు ఉన్నాయి. వీటిని తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.ఉడికించిన వేరుశెనగను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. మీ రోజువారీ ఆహారంలో ఉడికించిన వేరుశెనగను చేర్చడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

పోషకాలు:
ఉడికించిన వేరుశెనగలో ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, వివిధ విటమిన్లు, ఖనిజాలతో సహా శరీరానికి అవసరమైన అనేక పోషకాలు ఉంటాయి. ఇది మీ మొత్తం ఆరోగ్యానికి ముఖ్యమైనది.

ఆరోగ్యకరమైన కొవ్వు:
వేరుశెనగలో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొవ్వులని వైద్యులు చెబుతున్నారు. వీటిని పరిమిత పరిమాణంలో తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

యాంటీఆక్సిడెంట్ లక్షణాలు:
ఉడికించిన పప్పులో రెస్వెరాట్రాల్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను నియంత్రించడంలో ఉపయోగపడతాయి. ఈ యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఆక్సీకరణ ఒత్తిడి, వాపు వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి.

బరువు విషయానికొస్తే:
వేరుశెనగలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. అయితే ఇందులో ఉండే అధిక ప్రోటీన్లు, ఫైబర్ కంటెంట్ కడుపు నిండుగా ఉంచి ఆకలిని నివారిస్తుంది. మీ రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకుంటే, మీ ఆహారం సమతుల్యంగా ఉంటుంది. మీ బరువు పెరగదు.

రక్తంలో చక్కెర నియంత్రణ:
ఉడికించిన వేరుశెనగలో ఉండే ఫైబర్ కంటెంట్ చక్కెర శోషణను తగ్గిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ముఖ్యంగా షుగర్ సమస్యలతో బాధపడేవారికి ఉడికించిన అన్నం మంచి ఆహారంగా మారుతుంది.

మానసిక ఆరోగ్యం:
ఉడికించిన వేరుశెనగలో మెదడు ఆరోగ్యానికి అవసరమైన ఫోలేట్, నియాసిన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అవి నాడీ వ్యవస్థకు సహాయపడతాయి.అభిజ్ఞా పనితీరును మెరుగుపరుస్తాయి.




బ్లాక్ కిస్‌మిస్‌లో.. బోలెడు ప్రయోజనాలు

కిస్మిస్‌లు సర్వసాధారణంగా దొరికేవే. అయితే మనలో చాలా మంది బ్లాక్ కిస్మిస్‌లను తీసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపించరు. బ్లాక్ కిస్మిస్‌లతో పోల్చితే బ్రౌన్ కలర్‌లో ఉండే కిస్మిస్‌లను తీసుకోవడానికి మొగ్గు చూపుతుంటారు. అయితే చూడ్డానికి బాలేవని అస్సలు లైట్ తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ బ్లాక్ కిస్మిస్‌లను ఆహారంలో భాగం చేసుకుంటే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో ఇప్పుడు తెలుసుకుందాం..

* ప్రస్తుతం ఐరన్ లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్యలు ఎక్కువుతున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే కచ్చితంగా బ్లాక్ కిస్మిస్‌లను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలో రక్తం పెరగడంలో కిస్మిస్‌లు ఉపయోగపడతాయి.
* ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే బ్లాక్ కిస్మిస్‌లను తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆస్టియోపోరోసిస్‌తో బాధపడేవారికి బ్లాక్ కిస్మిస్ చాలా మంచిది. బ్లాక్ కిస్మిస్‌తో ఎముకలకు బలం చేకూరుతుంది.
* రోగ నిరోధక శక్తిని పెంచడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా వార్షా కాలంలో వచ్చే ఇన్‌ఫెక్షన్ల బారి నుంచి తప్పించుకోవాలంటే బ్లాక్ కిస్మిస్‌లను తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
* గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా నల్ల ఎండు ద్రాక్ష కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో పుష్కలంగా లభించే పొటాషియం, విటమిన్ సి గుండె ఆరోగ్యాన్ని రక్షిస్తాయి.
వీటిలోని విటమిన్ సి ధమనుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.
* మలబద్ధకం, పైల్స్ వంటి జీర్ణాశయ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి కూడా బ్లాక్ కిస్మిస్‌లు బాగా ఉపయోగపడతాయని అంటున్నారు. వీటిలోని ఫైబర్ పేగు కదలికను ప్రోత్సహిస్తుంది. కిస్‌మిస్ తింటే.. జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం, పైల్స్ వంటి సమస్యలను దూరం చేస్తుంది.
* బ్లాక్ కిస్మిస్‌లను తీసుకునే విధానంలో కూడా కొన్ని పద్ధతులు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కిస్మిస్‌లను రాత్రంతా నానబెట్టి ఉదయం తీసుకుంటే మరింత మేలు జరుగుతుందని చెబుతున్నారు. నాన బెట్టిన నీటిని తాగడం వల్ల కూడా ఎన్నో రకాల లాభాలు ఉంటాయని అంటున్నారు.





జుట్టు సమస్యలకు.. పైనాపిల్‌తో చెక్..

పైనాపిల్ రుచికరమైన ఒక పండు. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అంతేకాకుండా, మీరు జుట్టు సంరక్షణ కోసం కూడా దీనిని ఉపయోగించవచ్చు. ఇది బ్రోమెలైన్ వంటి ఎంజైమ్ లను కలిగి ఉంటుంది. ఇది జుట్టు పెరుగుదలను పెంచడంలో సహాయపడుతుంది. పైనాపిల్‌ను ఉపయోగించడం ద్వారా మీరు జుట్టు సమస్యల నుండి బయటపడతారు. మీ జుట్టు మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది. పైనాపిల్ ను జుట్టుకు అప్లై చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఒకసారి చూద్దాం.

చుండ్రు నుండి ఉపశమనం:
మీరు చుండ్రు సమస్యతో పోరాడుతున్నట్లయితే, పైనాపిల్ వాడకం మీకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఓ ప్రచురించబడిన అధ్యయనం ప్రకారం.., ఇది సహజ యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంది. ఈ లక్షణాల కారణంగా, మీరు జుట్టులో పెరిగే ఈస్ట్ నుండి బయటపడవచ్చు. ఇది చుండ్రుకు ప్రధాన కారణం.

జుట్టు మెరిసిపోతుంది:
పైనాపిల్‌లో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. దీని ద్వారా జుట్టు సిల్కీగా తయారవుతుంది. ఓ ప్రచురించబడిన ఒక అధ్యయనంలో దీని ద్వారా జుట్టు సహజమైన షైన్ పునరుద్ధరించబడుతుందని వెల్లడించింది. పైనాపిల్‌లో ఉండే పోషకాలు పర్యావరణ మూలకాల వల్ల కలిగే నష్టం నుండి జుట్టును రక్షిస్తాయి. ఈ కారణంగా జుట్టు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా మెరిసేలా కనిపిస్తుంది.

చిక్కుబడ్డ జుట్టును పరిష్కరించడం:
వర్షా కాలంలో పెరిగిన తేమ కారణంగా జుట్టు జిగటగా మారుతుంది. దాంతో వెంట్రుకలు సులభంగా చిక్కుకుపోతాయి. అయితే, ఈ సమస్యను అధిగమించడానికి మీరు పైనాపిల్ ఉపయోగించవచ్చు. పైనాపిల్ సహజ మాయిశ్చరైజింగ్ లక్షణాలను కలిగి ఉంది. ఇది జుట్టు మూలాలను హైడ్రేట్ చేయడంలో సహాయపడుతుంది. ఈ లక్షణాల ద్వారా చిక్కుబడ్డ జుట్టు సులభంగా పరిష్కరించబడుతుంది.

రంగు జుట్టుకు:
ఈ రోజుల్లో ప్రజలు జుట్టు రంగును ఉపయోగించటానికి ఇష్టపడుతున్నారు. ఇది మంచి రూపాన్ని ఇస్తుంది. అయినప్పటికీ, జుట్టుకు రంగు వేయడానికి రసాయన జుట్టు రంగును ఉపయోగిస్తారు. ఇది చాలా హానికరం. ఈ రంగుల వల్ల కలిగే నష్టాన్ని సరిచేయడానికి మీరు పైనాపిల్‌ను ఉపయోగించవచ్చు. దీని ద్వారా రంగు మసకబారదు.

ఆఫ్ఘన్‌ను చిత్తుచిత్తు చేసిన భారత్

ఆసియా కప్ ఫైనల్‌కు దూకుడు!



- సెమీఫైనల్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం
- బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టిన భారత యువ క్రికెటర్లు

అల్ అమెరాత్ (ఒమన్), నవంబర్ 12 : అండర్-19 ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో భారత యువ జట్టు అదరగొట్టింది. గురువారం ఒమన్‌లోని అల్ అమెరాత్ క్రికెట్ మైదానంలో జరిగిన రెండో సెమీఫైనల్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆఫ్ఘన్ జట్టు భారీ స్కోరు సాధించలేకపోయింది. 228 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కెప్టెన్ లక్ష్య రాజేశ్ రాయ్‌చందాని, ఆర్యవీర్ సెహ్వాగ్ శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 117 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి విజయానికి బాటలు వేశారు. రాయ్‌చందాని దూకుడుగా ఆడగా, ఆర్యవీర్ సెహ్వాగ్ అర్ధసెంచరీతో రాణించాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన వీకే వినీత్ కూడా అర్ధసెంచరీ సాధించి జట్టును విజయతీరాలకు చేర్చాడు. కెప్టెన్ రాయ్‌చందాని తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. నూర్ అలీ నియాజీ వేసిన 37వ ఓవర్ ఐదో బంతిని వినీత్ సిక్సర్‌గా మలచడంతో భారత్ 36.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ విజయంతో ఫైనల్‌కు చేరిన భారత యువ జట్టు శనివారం జరిగే తుది పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. దీంతో భారత్--పాక్ ఫైనల్‌పై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

టెస్టు క్రికెట్‌లో భారీ మార్పులు

- ఐసీసీ సంచలన నిర్ణయాలు?
- ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో 12 జట్లకు అవకాశం కల్పించే ప్రతిపాదన
- తొమ్మిది జట్ల విధానాన్నే కొనసాగించే అవకాశాలపై చర్చ

బాలి (ఇండోనేషియా), నవంబర్ 12: అంతర్జాతీయ క్రికెట్‌లో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతోంది. ఇండోనేషియాలోని బాలిలో జరుగుతున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బోర్డు సమావేశాల్లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ), భవిష్యత్ క్రికెట్ పర్యటనలు, మూడు ఫార్మాట్ల భవితవ్యంపై కీలక చర్చలు జరుగుతున్నాయి. ముఖ్యంగా డబ్ల్యూటీసీలో ప్రస్తుతం ఉన్న తొమ్మిది జట్ల సంఖ్యను 12కు పెంచాలనే ప్రతిపాదనపై ఉత్కంఠ నెలకొంది. బుధవారం ప్రారంభమైన ఈ సమావేశాలు ఆదివారం వరకు కొనసాగనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో తొమ్మిది జట్లు మాత్రమే పోటీపడుతున్నాయి. జింబాబ్వే, ఐర్లాండ్, ఆఫ్ఘనిస్థాన్‌లకు అవకాశం లేదు. వచ్చే సైకిల్ నుంచి మొత్తం 12 టెస్టు దేశాలకు చోటు కల్పించాలని ప్రతిపాదించినప్పటికీ ఆచరణలో ఆటంకాలు ఎదురవుతున్నట్లు సమాచారం. దీంతో తొమ్మిది జట్ల విధానాన్నే కొనసాగించడం లేదా జింబాబ్వేను పదో జట్టుగా చేర్చడం వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జట్ల సంఖ్య పెరిగితే అంతర్జాతీయ పర్యటనల భారం పెరగడంతోపాటు దేశవాళీ క్రికెట్ కార్యక్రమాలకు ఇబ్బందులు ఎదురవుతాయని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. మరోవైపు ఆర్థిక సమస్యల కారణంగా ఐర్లాండ్ ఎక్కువ టెస్టులు ఆడే పరిస్థితులపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డబ్ల్యూటీసీలో అవకాశం దక్కకపోతే మరిన్ని టెస్టులు ఆడాలనుకుంటున్న జింబాబ్వేకు నిరాశ తప్పకపోవచ్చు. 2027 నుంచి 2031 వరకు అమలయ్యే భవిష్యత్ పర్యటనల ప్రణాళిక కూడా సమావేశాల్లో ప్రధాన అంశంగా మారింది. ఇందులో భాగంగా ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల జింబాబ్వే పర్యటనలపై చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ఉత్తర అమెరికాలో క్రికెట్ విస్తరణ కోసం వాషింగ్టన్, టొరంటో నగరాల్లో పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు నిర్వహించే అవకాశాలను వెస్టిండీస్ పరిశీలిస్తోంది. టెస్టులు, టీ20ల మధ్య వన్డే క్రికెట్ ప్రాధాన్యం తగ్గుతున్న నేపథ్యంలో ఆ ఫార్మాట్ భవిష్యత్తుపైనా ఐసీసీ దృష్టి సారించింది. అంతర్జాతీయ సలహా సంస్థ మెకిన్సే రూపొందించిన వ్యూహాత్మక నివేదికను బోర్డు పరిశీలించనుంది. వన్డే హోదా కలిగిన దేశాల సంఖ్య, మ్యాచ్‌ల నిర్వహణ, ప్రసార హక్కుల ఆదాయం, సభ్య దేశాలకు నిధుల పంపిణీ వంటి అంశాలపై చర్చించే అవకాశముంది. ఆఫ్ఘనిస్థాన్ మహిళా క్రికెటర్ల కోసం ప్రత్యేక కార్యక్రమం రూపొందించడం, ఐసీసీ పాలనా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం వంటి అంశాలు కూడా సమావేశాల అజెండాలో ఉన్నాయి. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా నేతృత్వంలోని పాలనా సమీక్ష కమిటీ ప్రాథమిక సిఫార్సులను సమర్పించనుంది. అయితే డబ్ల్యూటీసీ విస్తరణతోపాటు ఇతర ప్రతిపాదనలపై తుది నిర్ణయాలు వెలువడాల్సి ఉంది. దీంతో బాలి సమావేశాల ఫలితాలపై క్రికెట్ ప్రపంచంలో ఆసక్తి నెలకొంది.

ముంబై పగ్గాలు మళ్లీ రోహిత్‌కేనా..

శాంట్నర్ మాటలతో కొత్త చర్చ! ■ హార్దిక్ పాండ్యా నిష్క్రమణతో ముంబై కెప్టెన్సీపై ఉత్కంఠ



ముంబై, నవంబర్ 12 : ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే ముంబై ఇండియన్స్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు మారగా, ఆ జట్టు స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌లో చేరాడు. ఈ పరిణామంతో ముంబై జట్టు తదుపరి కెప్టెన్ ఎవరనే చర్చ మొదలైంది. ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించిన రోహిత్ శర్మ మళ్లీ పగ్గాలు చేపడతారా అనే ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. న్యూజిలాండ్‌లోని హామిల్టన్‌లో వర్షం కారణంగా మూడో వన్డే రద్దయిన అనంతరం రోహిత్ శర్మ ఆటగాళ్లను పలకరించారు. ఈ సందర్భంగా శాంట్నర్‌ను రోహిత్ ఆప్యాయంగా పలకరించగా, శాంట్నర్ తిరిగి 'హలో కెప్టెన్' అంటూ సంబోధించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రోహిత్ మళ్లీ ముంబై కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారనే ప్రచారానికి ఈ వ్యాఖ్యలు మరింత ఊతమిచ్చాయి. అయితే శాంట్నర్ సరదాగా లేదా గౌరవంతో అలా పిలిచి ఉండవచ్చని, దానిని కెప్టెన్సీ మార్పునకు సంకేతంగా భావించలేమని క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ రేసులో రోహిత్‌తోపాటు సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు రూ.18 కోట్ల ఒప్పందంతో హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు మారగా, అదే మొత్తంతో అర్ష్‌దీప్ సింగ్ ముంబైలో చేరినట్లు సమాచారం. 2024 నుంచి ముంబైకి నాయకత్వం వహించిన హార్దిక్ నిష్క్రమణతో కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. అయితే ఫ్రాంచైజీ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ముంబై పగ్గాలు మళ్లీ రోహిత్‌కే అప్పగిస్తారా? లేక కొత్త నాయకుడిని ఎంపిక చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.



ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

వివాన్ కపూర్ సత్తా

పురుషుల ట్రాప్ విభాగంలో రజత పతకం కైవసం

దోహా, నవంబర్ 12: ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ వివాన్ కపూర్ అద్భుత ప్రదర్శనతో మెరిశాడు. పురుషుల ట్రాప్ విభాగంలో రజత పతకం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచాడు. స్వర్ణ పతకాన్ని త్రుటిలో చేజార్చుకున్నప్పటికీ 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు భారత్‌కు కోటా స్థానాన్ని అందించాడు. గురువారం జరిగిన ఫైనల్లో వివాన్ కపూర్, కువైట్ షూటర్ అబ్దుల్ రహమాన్ అల్‌ఫైహాన్ హోరాహోరీగా తలపడ్డారు. ఇద్దరూ 29 పాయింట్లతో సమంగా నిలవడంతో విజేతను నిర్ణయించేందుకు షూటాఫ్ నిర్వహించారు. ఉత్కంఠభరితంగా సాగిన షూటాఫ్‌లో అల్‌ఫైహాన్ 3-2 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో వివాన్ రజతంతో సరిపెట్టుకున్నాడు. స్వర్ణం చేజారినా ఒలింపిక్స్ కోటా సాధించడం భారత షూటింగ్‌కు కీలక విజయంగా నిలిచింది.

యూత్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి స్వర్ణం



డాకర్ (సెనెగల్), నవంబర్ 12: ప్రతిష్ఠాత్మక యూత్ ఒలింపిక్స్‌లో భారత బాక్సింగ్ చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించబడింది. మణిపూర్‌కు చెందిన యువ బాక్సర్ అంబేకర్ తన పిడి పంచ్‌తో అంతర్జాతీయ వేదికపై భారత కీర్తిపతాకను రెపరెపలాడించాడు. సెనెగల్‌లోని డాకర్ వేదికగా జరిగిన పురుషుల 50 కేజీల విభాగం ఫైనల్లో అంబేకర్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. హోరాహోరీగా సాగిన ఈ తుది పోరులో ఐర్లాండ్ బాక్సర్ క్రిస్టియన్ జుబానిపై 3-2 తేడాతో ఉత్కంఠభరిత విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్ విభాగంలో బంగారు పతకం గెలుచుకున్న తొలి భారతీయ బాక్సర్‌గా అంబేకర్ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. ఫైనల్ బౌట్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ, అంబేకర్ ఏమాత్రం తడబడకుండా 3-2 స్కోరుతో పైచేయి సాధించి దేశానికి చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. యూత్ ఒలింపిక్స్ చరిత్రలో బాక్సింగ్ విభాగంలో భారత్‌కు ఇది మొత్తం మీద మూడో పతకం కావడం విశేషం. గతంలో 2010 ఎడిషన్‌లో భారత బాక్సర్లు రెండు పతకాలు సాధించారు. ఆ ఏడాది 54 కేజీల విభాగంలో శివ థాపా రజత పతకం గెలుచుకోగా, అదే ఎడిషన్‌లో 60 కేజీల ఈవెంట్‌లో వికాస్ క్రిషన్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. నాడు రజత, కాంస్యాలతో సరిపెట్టుకున్న భారత్‌కు, ఇప్పుడు అంబేకర్ ఏకంగా స్వర్ణ పతకాన్ని అందించి ఆ లోటును భర్తీ చేశాడు.

ఎంసీఏ మ్యూజియానికి సచిన్ బ్యాట్లు

ముంబయి: క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ తన కెరీర్‌కు సంబంధించి అత్యంత ప్రాధాన్యమున్న జ్ఞాపకాలను అభిమానుల కోసం అందుబాటులో ఉంచనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్లో తాను ఉపయోగించిన 26 బ్యాట్లను ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ)కు చెందిన శరద్ పవార్ క్రికెట్ మ్యూజియంలో ప్రదర్శన కోసం సచిన్ బహుమతిగా ఇవ్వనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్లో శతకాలు బాదేందుకు ఉపయోగించిన కొన్ని బ్యాట్లు కూడా అందులో ఉన్నాయి. బ్యాట్లు, హెల్మెట్లు, జెర్సీలతో పాటు కెరీర్‌లో చరిత్రాత్మక ఘట్టాలకు సంబంధించి తాను వ్యక్తిగతంగా రాసుకున్న నోట్స్‌ను కూడా మ్యూజియానికి అందజేయనున్నాడు. 'బ్యాటోగ్రఫీ' పేరిట నిర్వహించనున్న ఈ ప్రదర్శనను ఈనెల 16న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆవిష్కరించనున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌కు సచిన్ వీడ్కోలు పలికి 13 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 2013 నవంబరు 16న సొంతగడ్డ వాంఖడే స్టేడియంలో వెస్టిండీస్‌పై సచిన్ చివరి అంతర్జాతీయ (200వ టెస్టు) మ్యాచ్ ఆడాడు.






ఆకట్టుకుంటున్న ‘ఇడుపు కాయితం’ టీజర్

విడాకుల నేపథ్యంలో ప్రియదర్శి, నాగదుర్గల కథ

ప్రియదర్శి, నాగదుర్గ జంటగా నటిస్తున్న చిత్రం ‘ఇడుపు కాయితం’ టీజర్ విడుదలైంది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా పెళ్లి, ఆ తర్వాత దంపతుల మధ్య చోటుచేసుకునే పరిణామాలు, చివరకు విడాకుల వరకు వెళ్లే పరిస్థితుల చుట్టూ సాగనుంది. తాజాగా విడుదలైన టీజర్‌లో పెళ్లిచూపులు, కొత్తజంట మధ్య అనుబంధాన్ని సహజంగా చూపిస్తూ చివర్లో విడాకుల ప్రకటనతో ఆసక్తి పెంచారు. దర్శకుడు వంశీ రెడ్డి దొండపాటి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా, సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నారు. అభినవ్ గోమటం, అభయ్, శివజ్యోతి, బిత్తిరిసత్తి కీలక పాత్రల్లో నటించారు. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రచార కార్యక్రమాలతోనూ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానున్న ‘ఇడుపు కాయితం’ ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.





పింక్ డ్రెస్‌లో మెరిసిన మిర్నా మీనన్

‘జైలర్’ సినిమాలో రజనీకాంత్ కోడలిగా నటించి ప్రేక్షకుల మెప్పుతో పాటు మంచి గుర్తింపు తెచ్చుకున్న మిర్నా మీనన్ ఇప్పుడు మరో తెలుగు సినిమాతో అలరించేందుకు సిద్ధమవుతోంది. ‘డాన్ బాస్కో’ చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన సినిమా టీజర్ విడుదల కార్యక్రమానికి పింక్ కలర్ డ్రెస్‌లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన అందం, స్టైలిష్ లుక్‌తో ఈవెంట్‌లో సందడి చేసింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతున్న మిర్నా కొత్త లుక్ ప్రస్తుతం అభిమానులను ఆకట్టుకుంటోంది.

‘తంత్ర 2’ షూటింగ్‌కు బ్రేక్?

నిర్మాతలకు చుక్కలు చూపిస్తున్న నిధి

టాలీవుడ్‌లో ‘ఇస్మార్ట్ బ్యూటీ’గా గుర్తింపు పొందిన నిధి అగర్వాల్ చుట్టూ ఇప్పుడు కొత్త వివాదం నెలకొన్నట్లు ఫిలింనగర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వరుసగా అశించిన విజయాలు దక్కకపోయినా, ఆమె వ్యవహారశైలిలో మార్పు రావడం లేదని, షూటింగ్ సమయంలో పెడుతున్న డిమాండ్లతో నిర్మాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. నిధి నటించిన ‘హరి హర వీరమల్లు’, ‘ది రాజా సాబ్’ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలు సాధించలేకపోయాయి. ఈ నేపథ్యంలో పెద్ద నిర్మాణ సంస్థల నుంచి అవకాశాలు తగ్గినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో 2024లో విడుదలైన హారర్ థ్రిల్లర్ ‘తంత్ర’కు సీక్వెల్‌గా రూపొందుతున్న ‘తంత్ర 2’లో అమెకు అవకాశం లభించింది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ఆమెకు భారీ పారితోషికం ఇచ్చేందుకు నిర్మాతలు అంగీకరించినట్లు సమాచారం. రెండు నెలల క్రితం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల మొదలైంది. అయితే నిధి అగర్వాల్ కారణంగానే చిత్రీకరణకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడిందని యూనిట్ వర్గాల సమాచారం. సెట్స్‌లో ఆమె కోరుతున్న అదనపు సౌకర్యాలు, షూటింగ్‌కు సంబంధించి తరచూ షెడ్యూల్స్ మార్చుకోవడం చిత్రబృందానికి ఇబ్బందిగా మారినట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం షూటింగ్ నిలిచిపోవడంతో నిధి ఈ ప్రాజెక్టులో కొనసాగుతారా? నిర్మాతలు మరో హీరోయిన్‌ను ఎంపిక చేసుకుంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే అవకాశాల విషయంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో ‘తంత్ర 2’ చుట్టూ నెలకొన్న ఈ పరిణామాలు ఆమె కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి.

‘గోట్’.. సుధీర్ కష్టపడ్డా.. కథ మెప్పించలేదు!



బుల్లితెరపై ‘సుడిగాలి’ సుధీర్‌గా ప్రేక్షకులను నవ్వించిన సుధీర్ ఆనంద్ తాజాగా ‘గోట్’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. వేదవ్యాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో దివ్యభారతి కథానాయికగా నటించారు. క్రికెట్ బెట్టింగ్, ప్రేమ, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన గణ (సుధీర్) విశాఖపట్నంలో చిన్నచిన్న నేరాలు చేస్తూ జీవిస్తుంటాడు. క్రికెట్ బెట్టింగ్‌లోనూ పాల్గొంటుంటాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఓ యువతిని అపహరించేందుకు వెళ్లి పొరపాటున పెళ్లి పీటలపై ఉన్న సుభాషిణి (దివ్యభారతి)ని తీసుకొస్తాడు. ఆమె రాకతో గణ జీవితంలో ఎలాంటి మార్పులు వచ్చాయి? జూదం కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్న రుద్రవరం గ్రామాన్ని ఎలా కాపాడాడు? అనేదే మిగిలిన కథ. క్రికెట్ బెట్టింగ్ వల్ల గ్రామీణ జీవితంపై పడుతున్న ప్రభావాన్ని కథాంశంగా ఎంచుకోవడం బాగున్నా, దాన్ని ఆసక్తికరంగా తెరకెక్కించడంలో దర్శకుడు విఫలమయ్యారు. ప్రేమ, కుటుంబ భావోద్వేగాలు, హాస్యం వంటి అంశాలను కలిపినా ఏ ఒక్కటీ బలంగా ఆకట్టుకోలేదు. ప్రథమార్ధంలో కొన్ని సన్నివేశాలు ఆసక్తి కలిగించినా ద్వితీయార్ధం నిరాశపరుస్తుంది. కథలో కొత్తదనం లేకపోవడం, తర్కానికి అందని సన్నివేశాలు, పండని హాస్యం ప్రధాన బలహీనతలు. సుధీర్ తన పాత్రకు న్యాయం చేసేందుకు ప్రయత్నించారు. పాటలు, పోరాట సన్నివేశాల్లో ఉత్సాహంగా కనిపించారు. దివ్యభారతి నటన ఆకట్టుకుంటుంది. సర్వదమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, పృథ్వీ, ఆడుకలం నరేన్ వంటి నటులు ఉన్నా వారి పాత్రలకు తగిన ప్రాధాన్యం దక్కలేదు. మొట్టె రాజేంద్రన్, చమ్మక్ చంద్ర అక్కడక్కడా నవ్వించారు. లియోన్ జేమ్స్ పాటలు, మణిశర్మ నేపథ్య సంగీతం సినిమాకు కొంత బలాన్నిచ్చాయి. మొత్తానికి సుధీర్ నటన, దివ్యభారతి పాత్ర, పాటలు మినహా ‘గోట్’లో చెప్పుకోదగ్గ ఆకర్షణలు పెద్దగా లేవు. బలహీనమైన కథనం, ప్రభావం చూపని భావోద్వేగాలు సినిమాను నిరాశపరిచాయి. సుధీర్ కష్టపడినా.. కథలో పస లేకపోవడంతో ‘గోట్’ కొన్ని నవ్వులకే పరిమితమైంది.

రోడ్డు ప్రమాదంలో శేఖర్ మాస్టర్ కారు ధ్వంసం

టాలీవుడ్ ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. నవంబర్ 11 రాత్రి శంషాబాద్ పరిధిలోని కొల్లూరు జంక్షన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. సినిమా పాట చిత్రీకరణ ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. శేఖర్ మాస్టర్ మరో డ్యాన్స్ మాస్టర్, డ్రైవర్‌తో కలిసి ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్నారు. కొల్లూరు వైపు నుంచి వస్తున్న వీరి కారు ముందుగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టింది. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన పండ్ల లోడ్ లారీ ఇన్నోవాను బలంగా ఢీకొట్టింది. వరుసగా జరిగిన ఢీకొనడంతో కారు ముందు, వెనుక భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే కారులో ఉన్నవారికి ప్రాణాపాయం తప్పింది. శేఖర్ మాస్టర్ స్వల్ప గాయాలతో బయటపడినట్లు సమాచారం.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com